ఈనాడు నిజామాబాద్

బుధవారం 16 ఆగస్టు 2017 | 16 పేజీలు

ముకుందా... ముకుందా



కృష్ణాష్టమి సందర్భంగా పెర్కిట్‌లో నిర్వహించిన విద్యార్థుల ప్రదర్శన



నిజామాబాద్‌లో విద్యార్థినుల ప్రదర్శన

ఉత్సాహం నింపిన ఉపాసన

వ్యాయామం, పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సినీ నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన అన్నారు. మంగళవారం దోమకొండలోని గడీ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తన తాత, గడీ కోట వారసులు, విశ్రాంత ఐఏఎస్ కామినేని ఉమాపతిరావుతో కలిసి పాల్గొన్నారు. జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం గడీ కోటలో గడిపారు. వేడుకలు, బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను కలిశారు. వారితో సరదాగా గడిపారు. కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న మలావత్ పూర్ణతో ఉపాసన, సంస్థానాధీశుల వారసులు ముచ్చటించారు. ఎవరెస్టు అధిరోహించిన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ శివరాం నాయక్ గడీకోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, ఎన్ఆర్ఐ బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, దోమకొండ**



ఉపాసనతో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు



ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచినందుకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ మంగళవారం రాష్ట్ర రాజధానిలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి పురస్కారం అందుకొన్నారు.
- న్యూస్‌టుడే, ఆర్మూర్

మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కడ చూసినా పచ్చదనం కన్పించే రోజులు దగ్గర్లో ఉన్నాయి... కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి... ఏడాదికి రెండు పంటలు రైతుల చేతికొచ్చే పరిస్థితి తీసుకొస్తాం.

రైతులంటే అప్పుల కోసం బ్యాంకుల వద్దకు వెళ్లే పరిస్థితిని మార్చుతాం.. లాభాలను దాచుకునేందుకు అన్నదాతలు బ్యాంకులకు వెళ్లేలా చేస్తాం. బ్యాంకు అధికారులతో రైతుల వెంటపడి ఇంటి వద్దకు వచ్చి బతిమాలి అప్పులు ఇస్తారు.

కురమ, యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.. జిల్లాలో ఇప్పటి వరకు 2961 యూనిట్ల గొర్రెలను వీరికి పంపిణీ చేశాం.

గ్రామీణ విద్యార్థులు పట్టణ, నగరాల్లో కార్పొరేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు దీటుగా రాణించేందుకు వీలుగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నాం.



కాళేశ్వరంతో సస్యశ్యామలం

- ఉమ్మడి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు నీరు
- హరితహారంలో జిల్లా మొదటి స్థానం
- స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి పోచారం

ఈనాడు, నిజామాబాద్

జిల్లా కేంద్రంలోని పోలీసు కవాతు మైదానంలో మంత్రి పోచారం మంగళవారం జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

వ్యవసాయానికి జీవం

పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిన ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌లోకు జలకళ సంతరింపచేసేందుకు ఈ నెల 10న ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుజ్జీవ పథకానికి శంకుస్థాపన చేశారు. మేడిగడ్డ నుంచి 60 టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్‌లోకి తరలించడంతో ఖరీఫ్‌కు సకాలంలో నీరు అందుతుంది. మేడిగడ్డ నుంచి గోదావరి జలాలను రివర్స్ పంపింగు ద్వారా తరలించనున్న నేపథ్యంలో ఉత్తర తెలంగాణలో 200 కి.మీ మేర ఈనదిలో బ్యారేజీల నిర్మాణం కారణంగా 80 టీఎంసీల **(మిగతా 7లో)**



జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి పోచారం, పక్కన జడ్పీ ఛైర్మన్ రాజు, కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులు



బోధన్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన



రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శివాజీనగర్, న్యూస్‌టుడే: గత 20 రోజులుగా తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన రిలే దీక్షలను టీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సంజీవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలోని తెరాస ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణన్నారు. చట్ట ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, చక్రపాణి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో 144 సెక్షన్ అమలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు సీపీ కార్తికేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనుమతులు, ర్యాలీలు నిర్వహించటం పూర్తి నిషేధమన్నారు. ఒకేచోట గుమిగూడి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ప్రజలందరు ఇందుకు సహకరించాలని సీపీ కోరారు.

ఖైదీలకు 'ఈ-ములాఖత్'

ఆన్‌లైన్‌లోనే తేదీ, సమయం

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: జైలు శిక్ష అనుభవిస్తున్న తమవారిని కలిసేందుకు ఇదివరకు తిప్పలు పడాల్సి వచ్చేది. కారాగారం వరకు వెళ్లి నిరీక్షించినా వారిని కలిసే వీలు దొరికేది కాదు. తీరా సమయం దొరికే సరికి ములాఖత్ సమయం అయిపోయిందని మధ్యలోనే పంపిన సందర్భాలున్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టి 'ఈ-ములాఖత్'ను జైళ్ల శాఖ శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నుంచి ఈ-ములాఖత్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ఆన్‌లైన్‌లోనే జైలు సమయ వేళల ప్రకారం తేదీలు, సమయాన్ని కేటాయించుకోవాల్సి ఉంటుంది. ఫలానా తేదీన మనకు కేటాయిస్తే ఆ రోజున వెళ్లి జైలు శిక్ష అనుభవిస్తున్న కుటుంబీకులు, బంధువులను సులువుగా కలువవచ్చు. ప్రత్యేకంగా జైలు అధికారులు ఇందుకోసం సమయం కేటాయించనున్నారు. ఇందుకోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఈప్రిసన్స్. ఎన్ఐసీ. ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ వ్యక్తులు ఉన్న జైలు వివరాలను ఎంపికచేసుకోవాల్సి ఉంటుంది. తాము కలవాల్సిన తేదీ, సమయాన్ని ఎంచుకొని ములాఖత్‌ను కోరాల్సి ఉంటుందని జైలు సూపరింటెండెంట్ కళాసాగర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ములాఖత్ ఉంటుందన్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజలకు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నాందేడ్ సమాచారం

ఇద్దరికి రాష్ట్రపతి పురస్కారం

నాందేడ్, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు పోలీస్ అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి పురస్కారం లభించింది. పోలీస్ డిప్యూటీ కమిషనర్ నాగ్‌నాత్ కోడే, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వివేక్ ముగిలికర్‌లకు రాష్ట్రపతి పురస్కారం లభించింది. నాగ్‌నాత్ కోడే 1987లో సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఉస్మానాబాద్, బీడ్, జిల్లాలతో పాటు నాందేడ్‌లో విధులు నిర్వహించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ప్రస్తుతం ఔరంగాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా సేవలు అందిస్తున్నారు. సీఐ వివేక్ ముగిలికర్ ట్రాఫిక్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పురస్కారానికి ఎంపిక చేసింది.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నాందేడ్, న్యూస్‌టుడే: నగరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి కార్యక్రమాలు మొదలు కాగా వివిధ పాఠశాలలు, కార్పొరేషన్ కార్యాలయం, కలెక్టరేట్, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అర్జున్ కోత్కర్, ఎమ్మెల్యేలు హేమంత్ పాటిల్, ప్రతాప్ పాటిల్, కలెక్టర్ అరుణ్ డోంగ్రేతో పాటు రాజకీయ నాయకులు, పురప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధులు పాల్గొన్నారు. నెహ్రూ, నాగార్జున, యూనివర్సల్ పాఠశాలల్లో జెండా వందనంతో పాటు చిన్నారులు రేజింగ్ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రుణమాఫీ చేయాలని రైతుల రాస్తారోకో

నాందేడ్, న్యూస్‌టుడే: పంటలు సరిగా పండక ఆర్థికంగా నష్టపోయిన రైతులకు రుణమాఫీ చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. జిల్లాలోని నాందేడ్, హిమాయత్ నగర్, కిన్వట్, లోహా, దెగ్లూర్, మాలేగాం, సోన్‌ఖేడ్, మాహూర్, బోకర్ తదితర ప్రాంతాల్లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతు నాయకుడు అజిత్ నవ్లే నేతృత్వంలో రైతులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని లాతూర్ పాట, చావసంపటన, చావ క్రాంతివీర్ సేనా, సభ్యులు రాజేష్ మోరే, జిల్లాధ్యక్షుడు నారాయణ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన దీక్ష

నాందేడ్, న్యూస్‌టుడే: నగరంలోని హమాల్‌పుర, విష్ణునగర్, గోరక్షణ్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని వార్డు అధ్యక్షుడు ప్రభాకర్ కెంగల్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఇళ్ల కోసం గతంలో కార్పొరేషన్, కలెక్టరేట్ ఎదుట చాలా సార్లు ఆందోళన నిర్వహించామన్నారు. ఇప్పటికైనా పేదలకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ అరుణ్ డోంగ్రే వినతి పత్రం అందజేశారు.



జెండా వందనంలో పాల్గొన్న ప్రముఖులు



పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని నిరాహార దీక్ష చేస్తున్న వార్డు సభ్యులు

ఆర్యవైశ్య విద్యార్థులకు సత్కారం

కిషన్‌గంజ్(నిజామాబాద్ సాంస్కృతికం), న్యూస్‌టుడే: శ్రావణ మాసం మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని కిషన్‌గంజ్ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అర్చకులు వేలేటి గౌరీశంకర్‌శర్మచే సామూహికంగా మంగళగౌరీవ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవలే వైద్య ప్రవేశ నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అలాగే ఆపరేషన్‌లో ప్రతిభ చాటిన డాక్టర్ పణిరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు కొండ వీరశేఖర్‌గుప్తా మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పార్శి మహేశ్వర్‌గుప్తా, సిద్దిరాజేశ్వర్, రాజేందర్, మురళి, రాజు, పోచయ్య, ఆగమయ్య పాల్గొన్నారు.


ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

18నుంచి సంతోష సాధన శిక్షణ

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీరవిశంకర్ గురూజీ అందించిన సంతోషసాధన శిక్షణ సాధన శిబిరం ఈ నెల 18 నుంచి 20 వరకు ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రం లేడీస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి రాజ్‌రాణి అగర్వాల్, క్లబ్ ప్రధాన కార్యదర్శి ఉష ఒక ప్రకటనలో తెలిపారు. సుదర్శన క్రియ యోగా, ప్రాణాయామం, ధ్యానం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, సృజనాత్మకతను పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణను ఆన్‌లైన్‌లో రవిశంకర్‌గురూజీ సాధన చేయిస్తారన్నారు.

బోధన్ రూరల్ సీఐగా గోవర్ధనగిరి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: బోధన్ రూరల్ సీఐగా గోవర్ధనగిరి నియమితులయ్యారు. ఈ మేరకు ఐజీ స్టీఫెన్ రవీంద్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విద్యుత్ శాఖలోని విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఈయన తాజాగా అక్కడి నుంచి రిలీవ్ అయి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. దీంతో నిజామాబాద్‌లో ఖాళీగా ఉన్న బోధన్ సర్కిల్ బాధ్యతలు అప్పగించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. బోధన్ రూరల్ సీఐగా ఇది వరకు పనిచేసిన శ్రీనివాసులు సస్పెన్షన్ అయిన సంగతి తెలిసిందే. ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో ఈయన్ను సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఈ సర్కిల్ పోస్టు ఖాళీగానే ఉంది. వినాయకచవితి, బక్రీద్ పండగలు వస్తున్న నేపథ్యంలో పోస్టు భర్తీపై అధికారులు దృష్టి సారించారు. దీంట్లో భాగంగానే గోవర్ధనగిరికి బాధ్యతలు అప్పగించినట్లు వినికిడి. నేడో, రేపో ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉంది.

రెంజల్ ఎస్సైగా ప్రభాకర్

* ధర్పల్లికి సురేష్

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖాళీగా ఉన్న పలు ఠాణాలకు పలువురు ఎస్సైలకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగిస్తు సీపీ కార్తికేయ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై రవికుమార్ సస్పెన్షన్‌తో ఖాళీగా ఉన్న రెంజల్ ఠాణాకు బోధన్ గ్రామీణ ఠాణా ఎస్సై ప్రభాకర్‌ను బదిలీ చేశారు. బోధన్ గ్రామీణ ఠాణా ఎస్సైగా ఎస్‌బీలో పని చేస్తున్న అంబరియాను కేటాయించారు. ఆరోపణల నేపథ్యంలో ధర్పల్లి ఎస్సై మురళిని వీఆర్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ధర్పల్లి ఠాణాకు ఎస్‌బీలో పనిచేస్తున్న సురేష్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరందరికి అటాచ్‌మెంట్ కింద బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. త్వరలో గణేశ్ ఉత్సవాలు రానున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఠాణాలను తాత్కాలికంగా భర్తీ చేశారు.

ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)

స్క్రీన్1: జయ జానకి నాయక 10.40, 4.30, 7.20, నేనే రాజు నేనే మంత్రి 1.30, 10.30(రాత్రి)

స్క్రీన్2: జయ జానకి నాయక 1.35, ఫిదా 4.30, 10.25(రాత్రి), నేనే రాజు నేనే మంత్రి 10.40, 7.25

స్క్రీన్3: లై 10.45, 1.25, 4.20, 7.20, 10.20(రాత్రి)

నటరాజ్ (ఏసియన్ ముక్తా) – నేనే రాజు నేనే మంత్రి 11:15, 2:15 6:15, 9:15

విజయ్ – ఫిదా 11:15, 2:15 6:15, 9:15

లలితామహల్ – జయ జానకి నాయక 11:15, 2:15, 6:15, 9:15

అశోక్ – లై 11:15, 2:15, 6:15, 9:15

దేవి – గౌతమ్‌నంద 11:15: 2:15, 6:15, 9:15

శ్రీదేవి – నక్షత్రం 11:15, 2:15, 6:15, 9:15

తిరుమల – టాయిలెట్-ఏక్ ప్రేమ్‌కథ(హిందీ) 11:15, 2:15, 6:15, 9:15

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

స్వచ్ఛభారత్.. స్వచ్ఛగ్రామం వంటి కార్యక్రమాలు లేక ముందు నుంచీ ఊర్లలో చెత్తను ఎత్తుతున్నారు. మన ముక్కు పుటాలు అదిరి పోయే మురికిని స్వయంగా చేత్తులతో ఎత్తి పారిశుద్ధ్యాన్ని నెలకొల్పుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా వారి ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఇంత చేస్తున్నా ప్రభుత్వం తరఫున నుంచి వారికేలాంటి జీతాలు, ఆరోగ్య కార్డులు లేవు. వారెవరో కాదు మనం రోజూ ఉదయాన్నే చూసే పారిశుద్ధ్య కార్మికులు. చాలా గ్రామాల్లో వారికి చాలీచాలని జీతాలు ఇస్తున్నారు. ఏదైనా జబ్బు చేసి చికిత్స చేయించుకోవాలంటే ఏ ఆరోగ్య బీమా లేదు. ఇటువంటి సమస్యలతో పారిశుద్ధ్య కార్మికులుగా చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

న్యూస్‌టుడే, ధర్పల్లి

జీతాలు చాలక.. జీవితాలు గడవక

● పొగబారుతున్న పారిశుద్ధ్య కార్మికుల బతుకులు

గ్రామ పంచాయతీల్లో ఒక కార్యదర్శి తప్ప మిగతా వారందరినీ స్థానికంగా ఉండే వారిని తీసుకొని పనులు చేయిస్తున్నారు. ఈ సిబ్బందికి గ్రామ పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే నిధుల నుంచి జీతాలు చెల్లించాలి. అందులో ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇచ్చి పనులు చేయిస్తున్నారు. గ్రామ పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే నిధుల నుంచి 30 నుంచి 40 శాతం గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలుగా చెల్లించాలి. అందులో పారిశుద్ధ్య కార్మికుల వాటా 15 శాతం. అయితే గ్రామాల్లో పన్నులు తక్కువగా ఉండటంతో చిన్న గ్రామ పంచాయతీల్లో కార్మికులకు రూ.1500- రూ.2000, మేజర్ గ్రామ పంచాయతీల్లో రూ.3000- రూ.4500 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుని, వ్యాధులు రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి. కొంత మంది వారి జీతం కంటే చికిత్సలకే ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. పనికి సరిపడా వేతనాలు లేకపోవడంతో గ్రామాల్లో ఈ పని చేయాలంటే ఎవరూ ముందుకు రావాడం లేదు. దీంతో చాలా పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

ఎక్కడా సరిపడా లేరు

ఆయా గ్రామ పంచాయతీల జనాభా, ఆదాయం ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను నియమించుకుని పనులు చేయిస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో కనీసం ఐదు మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉండాలి. కానీ ఎక్కడా అంత మంది లేరు. మేజర్ గ్రామ పంచాయతీల్లో కనీసం 10-15 మంది ఉండాలి, ఎక్కడా 10 మందికి మించి లేరు.



ధర్పల్లి మార్కెట్‌లో చెత్తను ఎత్తున్న పారిశుద్ధ్య కార్మికులు





రెండు జిల్లాల్లో కొరత

	నిజామాబాద్	కామారెడ్డి
గ్రామ పంచాయతీలు	393	325
మేజర్ గ్రామ పంచాయతీలు	176	110
చిన్న గ్రామ పంచాయతీలు	217	215

జనశ్రీ బీమా తప్ప ఏమీ లేదు

కార్మిక చట్టం ప్రకారం వస్త్ర, వాణిజ్య, భవన నిర్మాణ కార్మికుల ఇంట్లో ఎవరు ప్రసూతి అయినా ప్రసూతి కానుక పథకం కింద రూ.20 వేలు, వివాహ కానుక పథకం కింద రూ.25 వేలు ఇస్తారు. కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక ఓపీ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం ఈ కార్మిక చట్టం వర్తించడం లేదు. గ్రామాల్లో మురుగుకాలువలు శుభ్రం చేయడం, చెత్తను ఎత్తి వేయడం వంటి పనులు చేస్తూ చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం వారికి కనీస వేతనాలు ఇవ్వక, ప్రత్యేక ఆరోగ్య బీమా లేకపోవడంతో చికిత్సలు చేయించుకోలేక పోతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ వారి పేరు మీద ఏడాదికి జనశ్రీ బీమా కింద రూ.150 బీమా చెల్లిస్తోంది. ఈ బీమా కింద ఉన్న కార్మికుడు సాధారణంగా మరణిస్తే అతని కుటుంబానికి రూ.30 వేలు, ప్రమాదంలో చనిపోతే రూ.75 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. ఈ డబ్బులు సరిపోక చాలా మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

సరైన వేతనాలు లేక ముందుకు రావడం లేదు

ప్రతి ఏడాది బీమా కడుతున్నాం

పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి ఏడాది బీమా కడుతున్నాం. ఈ ఏడాది సుమారు రూ.2.19 లక్షల బీమా డబ్బులు కట్టాం. పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక నిధులేవీ లేవు. పంచాయతీ జనరల్ నిధుల నుంచే జీతాలు చెల్లిస్తున్నాం. **- కృష్ణమూర్తి, డీపీవో, నిజామాబాద్**

ధర్పల్లిలో.. ఇద్దరే

	ఉండాల్సిన కార్మికులు	ఉన్నది
నిజామాబాద్	3000	2000
కామారెడ్డి	2800	1500

ధర్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ. జనాభా సుమారు 15 వేలకు పైగా ఉంటుంది. పంచాయతీకి పన్నుల రూపంలో ఏడాదికి సుమారు రూ.30 లక్షలకు పైగా ఆదాయం ఉంటుంది. ఈ గ్రామ పంచాయతీలో రెండేళ్ల క్రితం 15 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండేవారు. ఇందులో కొంత మంది రోగాల బారినపడి మృతిచెందారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. గ్రామాల్లో మురుగుకాలువలను మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక బృందంతో శుభ్రం చేయిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో చెత్తను ఈ ఇద్దరి సహాయంతోనే తొలగిస్తుండటంతో వారిపై పని భారం పడుతోంది.

నా భర్త చనిపోయారు



నా భర్త శంకర్ 20 ఏళ్లు పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేసి రెండేళ్ల క్రితం జబ్బు చేసి చనిపోయారు. ఇన్నేళ్లు పని చేస్తే మా కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చింది రూ.30 వేలు బీమా మాత్రమే. ఇళ్లు గడవక ప్రస్తుతం తాను ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికురాలిగా చేస్తున్నాను. ప్రభుత్వం స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

- గుంటి నర్సవ్వ, పారిశుద్ధ్య కార్మికురాలు

క్యాన్సర్ వచ్చింది.. సాయం అందలేదు



ఏడాదిన్నర క్రితం కడుపులో క్యాన్సర్ వచ్చింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం రాకపోవడంతో అప్పులు చేసి చిక్సిత చేయించుకున్నా. కార్మిక చట్టం కింద అమలయ్యే పథకాలను మాకు వర్తించేలా చూడాలి. చెత్త ఎత్తేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. కనీస వేతనాలు, ఆరోగ్య సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

- తలారి ముత్తెన్న, పారిశుద్ధ్య కార్మికుడు

దాడులకు పాల్పడిన వారిపై రౌడీషీట్లు తెరవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పద్మ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం తలపెట్టిన స్ఫూర్తియాత్రను అడ్డుకొని దాడులకు పాల్పడిన తెరాస నాయకులపై రౌడీషీట్లు తెరవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలో పార్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి కోదండరాం యాత్ర చేపడితే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వణుకు పుట్టిందన్నారు. ప్రజా సమస్యలను విస్మరించి పాలన సాగించడం దుర్మార్గమన్నారు. కేంద్రంలో మోదీ సర్కారు పేదల సంక్షేమానికి గండి కొడుతోందన్నారు. సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగుచెందారన్నారు. నీళ్ల, నిధులు, నియమాకాల నినాదంతో పోరాటం చేసి గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. ప్రభుత్వాన్ని గద్దె దించితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. కామారెడ్డిలో విద్యార్థిసంఘాల నాయకులపై దాడులకు పాల్పడిన తెరాస నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వీఎల్ నర్సింహ్మారెడ్డి, సహాయ కార్యదర్శి రాములు, కార్యవర్గ సభ్యులు బాలరాజు, దశరథ్, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, భానుప్రసాద్, రాజశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ

అలరించిన ఆత్మీయ సమ్మేళనం



మానవతా సదన్ చిన్నారుల నృత్యం



స్వాతంత్ర్య సమరయోధులను, కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ యోగితారాణా, జేసీ తదితరులు

నిజామాబాద్ సాంస్కృతికం, ప్రగతిభవన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను పురస్కరించుకొని మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపుకార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అలరించింది. డిచ్‌పల్లి మావనతాసదన్ చిన్నారులు అదిగదిగో..హరితాహారం.. అంటూ బృందనృత్యాలతో పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల శాస్త్రీయ నృత్యాలు, అష్ట గంగాధర్ పాటలు ఆకట్టుకున్నాయి. జాదూరంగనాథ్ ఇంద్రజాలం అబ్బురపర్చింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబుసభ్యులను, రాష్ట్రస్థాయి పురస్కారాలను అందుకున్న వారిని, ఉత్తమ శకటాలుగా నిలిచిన పలు శాఖాధికారులను సత్కరించారు. అనంతరం కలెక్టర్ యోగితారాణా మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర సాధన, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తే తప్పకుండా గుర్తింపు వస్తుందన్నారు. అధికారులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాతృమూర్తి గురుబచన్ కుమారి, జేసీ రవీందర్‌రెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా అధికారులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

అక్టోబరు 2 నాటికి చర్యలు

కామారెడ్డి: అక్టోబరు 2 నాటికి బహిరంగ మల విసర్జన జిల్లాగా ప్రకటింపజేయడానికి అధికారులు కృషి చేయాలని కామారెడ్డి జిల్లా పాలనాధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జనహిత సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. కామారెడి జిల్లాగా ఏర్పడే నాటికి ఇక్కడ 10 గ్రామాలు బహిరంగ మలవిసర్జన గ్రామాలు ఉండగా ప్రస్తుతం 112కు చేరాయన్నారు. అక్టోబరు 2 నాటికి 323 గ్రామాలు బహిరంగ మల విసర్జన రహిత పల్లెలు కావాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, స్థానిక అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఒక్కో అధికారి 8 గ్రామాలను దత్తత తీసుకొని పనిచేయాలన్నారు.

బోధన్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నవీపేట గ్రామీణం, న్యూస్‌టుడే: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా శిక్షకుడు నాగరాజ్‌గురూజీ పేర్కొన్నారు. నవీపేట మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో మంగళవారం సాయంత్రం ఆయన యోగా శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా ద్వారా వ్యక్తి ఆధ్యాత్మికంగా పరివర్తన చెందడమే గాక సంపూర్ణ ఆరోగ్యం పొందుతాడని సూచించారు. పదిరోజులపాటు ఈ శిక్షణ ఉంటుందని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు మల్లేష్, చంద్రమోహన్, ఉపసర్పంచి పోశెట్టి ఉన్నారు.

గులాం బాబా శోభాయాత్ర

బీర్కూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మంగళవారం సంతు గులాం బాబా జయంతిని పురస్కరించుకుని భక్తులు గులాం బాబా పల్లకితో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా పల్లకిని స్థానిక గులాం బాబా ఆలయం నుంచి కామప్ప, గాంధీ, మల్లాపూర్‌ల కూడళ్ల మీదుగా భజనలు, కీర్తనలతో శోభాయాత్ర చేపట్టారు.



బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో జెండావందనం



సాలూరలో నవభారత నిర్మాణంలో భాగస్వాములవ్వాలని ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు



ఎడపల్లి తహసీల్దారు కార్యాలయంలో..

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

బోధన్, న్యూస్‌టుడే: బోధన్ డివిజన్‌ను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలబెట్టే లక్ష్యంతో పని చేస్తున్నామని సబ్ కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె ప్రసంగించారు. దోషరహిత రెవెన్యూ రికార్డులు తయారు చేయడానికి 62 గ్రామాలు ఎంపిక చేసి 42 గ్రామాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఏప్రిల్ నుంచి 278 యువతులకు లబ్ధి అందించామన్నారు. 2,294 ఒంటరి మహిళలు, 45,637 మందికి ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 493 యూనిట్లకు 10,353 గొర్రెలు పంపిణీ చేశామన్నారు. ధర్మాస్పత్రిలో 226 మందికి కేసీఆర్ కిట్లు అందించామన్నారు. మార్పు పథకంలో భాగంగా సర్కారు ఆస్పత్రిలో కాన్పులు 68 శాతానికి చేర్చామన్నారు. ఆరోగ్యకరమైన పరిసరాల కోసం 22,949 వ్యక్తిగత మరుగుదొడ్లు(91 శాతం) నిర్మించామన్నారు. కస్తూర్బా పాఠశాల మరమ్మతుల కోసం రూ.17.44 లక్షలను వ్యక్తిగత శ్రద్ధతో కలెక్టర్ నుంచి మంజూరు చేయించానన్నారు. అనంతరం విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పురసంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు హబీబ్, కమిషనర్ స్వామినాయక్, తహసీల్దార్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

బోధన్ పట్టణం: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, కార్మిక, ఉద్యోగ సంఘాలు, విద్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

బోధన్ గ్రామీణం: బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాశంకర్ అధికారులతో కలిసి జాతీయజెండా ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపించారు. సాలూరలో నిర్వహించిన వేడుకల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామపంచాయతీ వద్ద నవభారత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. సంగం, పెంటాఖుర్దు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు దాతలు ప్రోత్సాహక నగదు అందించారు.



జూనియర్ కళాశాల ప్రాంగణంలో వందనం చేస్తున్న సబ్‌కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఎడపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దారు లత, ఎంపీపీ రజిత, ఇతర అధికారులు జెండా ఆవిష్కరించారు. పాఠశాలల్లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రెంజల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మోబిన్‌ఖాన్, తహసీల్దార్ వినయ్‌సాగర్, ఏఎస్ఐ వెంకన్న జాతీయ జెండాను ఎగుర వేశారు. రెంజల్‌లో గాంధీ విగ్రహం ముందు స్వచ్ఛభారత్‌పై గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు.

నవీపేట గ్రామీణం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజేందర్ కుమార్‌గౌడ్ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్, పోలీసుస్టేషన్, ఐకేపీ, సహకార సంఘం, పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



జానకంపేటలో గాంధీ వేషధారణలో చిన్నారులు



రెంజల్ ఠాణాలో బాలలకు నోటుపుస్తకాలు అందిస్తున్న పోలీసులు



రెంజల్‌లో మహాత్ముడి విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు



రెంజల్‌లో గౌరవవందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నవీపేట తహసీల్దార్ కార్యాలయంలో..



నవీపేట ఐకేపీ కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ



బల్దియా కార్యాలయం ఎదుట పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు



అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో..

బంగారు పతకం అందజేత

బుడ్మి(బాన్సువాడ): మండలంలోని బుడ్మి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫలితాల్లో 9.2 గ్రేడ్ సాధించిన జె.శ్రీనివాస్ అనే విద్యార్థికి మంగళవారం బాన్సువాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నార్ల సురేష్ బంగారు పతకం తోపాటు రూ.5 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఉత్తమ విద్యార్థికి బంగారు పతకం, నగదు పురస్కారం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆణిముత్యాల్లాంటి విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు.

బోధన్

టాపర్లకు సన్మానం

కల్యాపూర్, కూనేపల్లి(రెంజల్), న్యూస్‌టుడే: పది టాపర్‌కు బంగారు ఉంగరం, బాలలకు టై, బెల్టులు అందించారు ఎంపీటీసీ సభ్యుడు మైనిమోహన్. మండలంలోని కూనేపల్లి ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన సారికను ఉంగరం, జ్ఞాపికతో సత్కరించారు. కల్యాపూర్‌లోని 40 మంది బాలలకు టై, బెల్టు, బూట్లు వితరణ చేశారు. అలాగే టాపర్లు వంశీ, సారిక, నవ్యశ్రీ, సాయిప్రియలకు విశ్రాంత ఉపాధ్యాయుడు సంజీవరెడ్డి, తెలుగు పండితుడు గోవర్ధన్ రూ.వెయ్యి చొప్పున నగదు అందించారు. నీలాలో టాపర్లుగా నిలిచిన సరిత, అబ్రార్‌కు స్థానికుడైన సదిశివరావు నిలేకర్ రూ.వెయ్యి చొప్పున నగదు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ధనుంజయ, సర్పంచి బండారు పోశెట్టి, సాయిలు, కిష్టారెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, శ్రీనివాస్‌రావు, పీఆర్టీయూ నాయకులు సోమలింగంగౌడ్, రాజేందర్‌సింగ్ ఉన్నారు.



టాపర్లకు నగదు ప్రోత్సాహం అందించిన పూర్వ విద్యార్థులు

నవీపేట గ్రామీణం: నవీపేట బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని కట్టా నర్సింహారెడ్డి పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని నయనకు రూ.2 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని సర్పంచి కపిల చేతుల మీదుగా అందజేశారు. భవంతినారాయణ ట్రస్టు నిర్వాహకులు భవంతిదేవీదాస్, సుదర్శన్ స్థానిక బాలుర, బాలికల పాఠశాలలో పదిలో టాపర్‌గా నిలిచిన నిఖిల్, అఖిలకు రూ.2500 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గిరిరాజు తదితరులు ఉన్నారు.

బోధన్ పట్టణం: బోధన్ విజయమేరి పాఠశాలలో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన ఎనిమిది మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. ఎనిమిది మందికి రూ.54 వేలు పంపిణీ చేశారు. పాఠశాల తొలి బ్యాచ్‌కు చెందిన చంద్రావతి, కమల ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మార్గరెట్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శివన్నారాయణ, అజర్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల విరాళం

జానకంపేట(ఎడపల్లి), న్యూస్‌టుడే: మండలంలోని జానకంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు నీటి ఫ్రీజర్‌ను విరాళంగా అందించారు. 2000-01 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులందరూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా రూ.70 వేల విలువ చేసే చలువనీటి యంత్రాన్ని(ఫ్రీజర్)ను అందించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, సర్పంచి దశరథ్, ఎస్ఎంసీ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.



విద్యార్థిని నయనకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సర్పంచి కపిల



నీలాలో టాపర్‌కు నగదు ప్రోత్సాహం అందిస్తున్న గ్రామస్థుడు



పాఠశాలలో టై, బెల్టులు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు మోహన్



ఐకమత్యాన్ని చాటే విద్యార్థుల విన్యాసం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బోధన్, బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉల్లాసభరితంగా సాగాయి. సెంట్రల్ ఫంక్షన్ వేడుకల్లో విద్యార్థుల కేరింతలు మారుమోగాయి. డివిజన్ కేంద్రంగా ఏటా నిర్వహించే వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మంగళవారం నాటి వేడుకల్లోనూ 15 వరకు సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. వారం రోజులుగా పట్టణంలోని ఆయా విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సాధన చేసి తమ ప్రతిభను చాటుకునేలా పోటీపడి ప్రదర్శననిచ్చారు. వివిధ సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించేలా విన్యాసాలు, ప్రదర్శనలు చేశారు. సబ్ కలెక్టర్ సిక్తాపట్నాయక్ వారిని జ్ఞాపికలతో అభినందించారు.



జానపద గేయానికి నర్తిస్తున్న చిన్నారులు

జెండా నిర్లక్ష్యంపై సిబ్బందిని నిలదీసిన నాయకులు

నవీపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ జెండాను ఎగుర వేయకుండా నిర్లక్ష్యం చేసిన నీటిపారుదల సిబ్బందిని స్థానిక యువత, నాయకులు నిలదీసిన సంఘటన మంగళవారం నవీపేటలో చోటు చేసుకుంది. మంగళవారం ఇక్కడి నీటిపారుదల అధికారి శ్రీనాథ్, సిబ్బంది జెండా ఆవిష్కరణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు మండిపడ్డారు. కార్యాలయానికి స్థానికులు, నాయకులు వెళ్లగా ఏఈ శ్రీనాథ్ అందుబాటులో లేకపోవడంతో అక్కడున్న సిబ్బందిని నిలదీశారు. ఏఈ నిర్లక్ష్యంపై ఎంపీపీ రాజేంద్రకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఏఈ శ్రీనాథ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తాను జిల్లా నీటిపారుదల కార్యాలయంలో జెండా కార్యక్రమంలో పాల్గొనడంతో స్థానిక కార్యాలయంలో నిర్వహించలేకపోయానని పేర్కొన్నారు.

సర్పంచి, విండో అధ్యక్షుడి ఫిర్యాదులు

నీలా(రెంజల్): మండలంలోని నీలా గ్రామంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఒకరిపై మరొకరు దుర్భాషలాడుకొని పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లింది. నీలా సహకార సంఘం వద్ద మహాత్ముడి చిత్రపటం వద్ద కొట్టేందుకు ఇక్కడ కార్యదర్శి ఒక్కటే కొబ్బరికాయ అందుబాటులో ఉంచారు. అక్కడికి చేరుకున్న స్థానిక సర్పంచి బండారు పోశెట్టి తనకు కొబ్బరికాయ ఇవ్వకపోవడంపై విండో అధ్యక్షుడు సంగరిలింగన్నతో పాటు కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకున్నారు. అనంతరం ఇద్దరూ రెంజల్ ఠాణాలో ఫిర్యాదులు చేసుకున్నారు.

పండగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నీలా(రెంజల్), న్యూస్‌టుడే: పండగలను కుల, మతాలకు అతీతంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఏసీపీ మోహన్ పిలుపునిచ్చారు. మండలంలోని నీలా గ్రామంలో మత పెద్దలు, గ్రామస్థులతో మంగళవారం సర్పంచి బండారు పోశెట్టి అధ్యక్షతన ఆయన శాంతికమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండు నెలల వ్యవధిలో రానున్న వినాయకచవితి, దేవీనవరాత్రుల ఉత్సవాలతో పాటు బక్రీద్ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి బుద్ధులు చెప్పి ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. అల్లర్లు, వివాదాల జోలికి వెళ్లకుండా అదుపులో పెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కొని జీవితాలు పాడు చేసుకోవద్దని యువతను కోరారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేవారు ముందుగానే పోలీస్ శాఖ వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తేస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఏఎస్ఐ వెంకన్న, గంగాకృష్ణ, రాఘవేందర్, లింబాద్రి, ధర్మన్న, సాయిలు, గంగాకిషన్, ఫైజల్‌ఖాన్, ఖయ్యూం, అక్తర్, సలీం, నసీర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మోహన్



కాంగ్రెస్ నాయకులతో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

సింగూరు జలాలు ఇవ్వకుండా జాప్యం

ఎడపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం సింగూరు జలాలను నిజాంసాగర్‌కు విడుదల చేయకుండా జాప్యం చేస్తూ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడిక పెరగడంతో సాగు గణనీయంగా తగ్గిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సింగూరు ప్రాజెక్టు నిర్మించిందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం జల్లా ప్రజలకు సాగునీరు ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా వేరే రెండు నియోజకవర్గాలకు సాగునీరు ఇస్తోందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వరిపంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, సింగూరు జలాలు వదిలితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో ఎడపల్లి, రెంజల్, నవీపేట జడ్పీటీసీలు సరోజనమ్మ, నాగభూషణంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాయకులు రామ్మోహన్, నర్సింగ్, రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, స్వామిగౌడ్ ఉన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న సానిటరీ సూపర్‌వైజర్ గంగాధర్

సేవలకు గుర్తింపు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగంలో పని చేసే వారికి గుర్తింపు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరైడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి పోచారం, కలెక్టర్ యోగితారాణా బోధకు చెందిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న స్వీపర్ సాయమ్మ



జిల్లా కేంద్రంలో కోలాటం ఆడుతున్న బ్రహ్మకుమారీలు

ఓం శాంతి కేంద్రంలో శ్రీకృష్ణజన్మాష్టమి

కామారెడ్డి సాంస్కృతికం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రం ఓం శాంతి కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణజన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. బ్రహ్మకుమారీలు, మహిళలు కోలాటం ఆడారు. అనంతరం కేంద్రంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కామారెడ్డి, కామారెడ్డిగ్రామీణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు దేశభక్తి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చక్కటి ప్రదర్శనలు ఇచ్చారు. పిరమిడ్లు, యోగాసనాలు, చిన్నారుల నృత్యాలు అలరించాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆయా శాఖల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించారు. వ్యవసాయశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, గొర్రెల పంపిణి, రెండు పడకగదుల ఇళ్లనిర్మాణం, అటవీ శాఖ, విద్యాశాఖ, సంక్షేమశాఖలు చేపడుతున్న కార్యక్రమాల్ని వివరిస్తూ శకటాలు ప్రదర్శించారు. ఆయా శాఖలకు సంబంధించి లబ్ధిదారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆస్తులు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయశాఖ, వికలాంగుల శాఖల ద్వారా ట్రాక్టర్లు, వాహనాలు, మూడు చక్రాల సైకిళ్లను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ షిండే, పాలనాధికారి సత్యనారాయణ, జేసీ సత్తయ్య తదితరులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అమరవీరులకు నివాళులు

కామారెడ్డి, న్యూస్‌టుడే: తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. హౌజింగ్‌బోర్డు కాలనీలోని స్తూపం వద్ద ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ షిండే, పాలనాధికారి సత్యనారాయణ, ఎస్పీ శ్వేత తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.



అమరులకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ శ్వేత ,ఎమ్మెల్యే హన్మంత్ షిండే, పాలనాధికారి సత్యనారాయణ,



బురుజుపై జెండావిష్కరణ

గడీ కోటలో సంబరాలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని గడీ కోటలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు. గడీ కోటలో సంస్థానాధీశుల వారసులు, విశ్రాంత ఐఏఎస్ కామినేని ఉమాపతిరావు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఆయన మనవరాలు ఉపాసన (సినీ నటుడు రామ్‌చరణ్ భార్య) కోటకు వచ్చారు. మండల కేంద్రంలోని బురుజు కోట వద్ద వీఆర్వో రమేశ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గడీ కోట, గ్రామాభివృద్ధి కమిటీ ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, ఎన్ఆర్ఐ బాలప్రసాద్, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీగంజ్‌లో...



వన్‌టౌన్ చౌరస్తాలో...

చినుకు పడితే చిత్తడే

నిజామాబాద్ నగరంలోని రోడ్లపై ప్రయాణించాలంటే జనాలు భయపడుతున్నారు. ఏ రోడ్డుపై చూసిన గుంతలు, వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లపై పడిన చిన్న చిన్న గుంతలను పూడ్చాల్సిన నగరపాలక సంస్థ వారు చేతులెత్తేశారు. దీంతో చిన్న వర్షానికే రోడ్లన్ని చిత్తడిగా మారి, గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిలిచి వాహనదారులకు నరకం చూపెడుతున్నాయి. ప్రధాన రోడ్లే ఇలా ఉంటే గల్లీలోని రోడ్ల పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.

- ఈనాడు, నిజామాబాద్



రైల్వేస్టేషన్ చౌరస్తాలో...



గోశాల వెనుకాల రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సిద్ధిరామేశ్వరాలయంలో కంకణాల పంపిణీ

భిక్కనూరు, న్యూస్‌టుడే: తితిదే ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో పంపించిన కంకణాలను సిద్ధిరామేశ్వరాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. మనగుడి కార్యక్రమంలో భాగంగా తితిదే ధర్మప్రచారపరిషత్ వారు కంకణాలు, పసుపు, కుంకుమ పంపిస్తుంటారు. అక్కడి నుంచి వచ్చిన కంకణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులకు, భక్తులకు ఆలయాధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నంద రమేశ్, సర్పంచి నర్సింహారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బాణాల అమృతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులకు కంకణాలు కడుతున్న అర్చకుడు

కాళేశ్వరంతో సస్యశ్యామలం

మొదటి పేజీ తరువాయి

నీరు నిల్వ ఉండి జీవధారను తలపిస్తుంది. 110 కి.మీ. పొడవున వరదకాలువలో కూడా ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు వృద్ధి అవుతాయి. మేడిగడ్డ నుంచి రివర్స్ పంపింగు ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 4.80 లక్షల ఎకరాలకు, కాళేశ్వరం మిడ్ మానేరు నుంచి మల్లన్నసాగర్ ద్వారా నీటిని తరలించడం ద్వారా నిజాంసాగర్ కింద ఉన్న 2.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. మొత్తంగా కాళేశ్వరం జలాలతో ఉభయ జిల్లాల్లో 7 లక్షల ఎకరాలకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. నిజాంసాగర్ ప్రధాన కాలువల ఆధునికీకరణ కింద రూ.1000 కోట్లు ఖర్చు చేసి చివరి ఆయకట్టుకు నీరు అందించేలా పనులు కొనసాగుతున్నాయి.

అనుబంధరంగాలకు పెద్దపీట

గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించి లాభసాటి వృత్తిగా మార్చేందుకు రూ.120 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 19 వేల మంది గొర్రెల పెంపకందారులకు ప్రయోజనం చేకూర్చనున్నారు. 9,631 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,961 యూనిట్లను లబ్ధిదారులకు అంద

జేశారు. రూ.32.86 కోట్లు ఖర్చు చేశారు. గత ఏడాది 340 చెరువుల్లో 2 కోట్ల చేప పిల్లలు నూరు శాతం రాయితీతో వదిలారు. ఈసారి కూడా భారీ సంఖ్యలో చేప పిల్లలను వదిలేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

కుళాయి ఎప్పుడు తిప్పినా నీరే

జిల్లాలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అంతరాయం లేకుండా తాగునీటి సరఫరాకు వీలుగా రూ.4 వేల కోట్ల వ్యయంతో మిషను భగీరథ పనులు కొనసాగుతున్నాయి. ఏ సమయంలో నల్లా తిప్పినా నీరు వచ్చేలా ఏడాది పొడవునా నీటి సరఫరా ఉంటుంది. ఈ ఏడాది డిసెంబరు ఆఖరు నాటికి మిషను భగీరథ కింద నీటి సరఫరా లాంఛనంగా మొదలవుతుంది.

వ్యవ'సాయం'

వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు ఎకరానికి రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించనున్నారు. 3 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతు సమగ్ర సర్వే ద్వారా వీరిని ఎంపిక చేశారు. యాసంగిలో రైతులు పంట సాగు చేసినా మరో దఫా రూ. 4 వేలు అందిస్తారు. జిల్లాలో 3.79 లక్షల మంది రైతులకు రూ. 1,571 కోట్ల మేర రుణాలు మాఫీ చేశారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సాగుకు సంబంధించి సలహాలు సూచనలు ఇచ్చేందుకు భారీ సంఖ్యలో వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించారు. ప్రస్తుత రబీ నుంచి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా చేయనున్నారు.

బతుకమ్మ పండుగకు చీర నజరానా

రాష్ట్ర పండుగ బతుకమ్మను ఈసారి ఘనంగా నిర్వహించనున్నారు. ఆడపడచులకు చేనేత చీరను ఉచితంగా ఇచ్చి పండుగ శోభను మరింత ఇనుమడింపచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 లక్షల చీరెలను పంపిణీ చేయనున్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా సర్కారు దవాఖానాలు

జిల్లా బోధనాసుపత్రితో పాటు ఇతర ఆసుపత్రుల్లో ఆధునాతన వైద్య పరికరాలను అందిస్తూ, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి దశలుగా వారీ చర్యలు తీసుకుంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా రోగులకు వైద్యసేవలు అందనున్నాయి. మాతా,శిశు సంరక్షణకు వీలుగా 16 వస్తువులతో కూడిన కిట్టును (కేసీఆర్ కిట్) జిల్లాలో 2,262 మంది బాలింతలకు అందజేశారు.

పేదింటికి కల్యాణలక్ష్మి అండ

ఉభయ జిల్లాల్లో ఇప్పటి వరకు 3,851 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింది లబ్ధి చేకూరింది. రూ. 30 కోట్ల మేర సొమ్ము వెచ్చించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి కల్యాణలక్ష్మి కింద ఇస్తున్న సొమ్ము రూ. 75,116 పెరగడంతో పేదల ఇంట ఘనంగా పెళ్లిల్లు జరుగుతున్నాయి.

గౌరవంగా బతికేలా సర్కారు అండ

ఇల్లు లేని పేదలను గుర్తించి రూ.5.46 లక్షల వ్యయంతో రెండు పడకల గృహం నిర్మించి ఇస్తున్నారు. జిల్లాకు 5,020 రెండు పడకల ఇళ్లు మంజూరు కాగా ఇవన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. దళితులకు మూడు ఎకరాల భూమిని అందజేసి ఆత్మగౌరవంతో బతికేలా సర్కారు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 333 మందికి 800 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఇందుకు రూ.37 కోట్లు ఖర్చు చేశారు. మరో 1000 ఎకరాల భూమిని పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సంక్షేమం

జిల్లాలో ఆసరా పింఛన్ల మంజూరుకు నెలకు రూ.27 కోట్లు వెచ్చిస్తున్నారు. 2.56 లక్షల మందికి ఆసరా పింఛన్లే ఆధారం. ఒంటరి మహిళలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు వీలుగా ఏప్రిల్ ఒకటి నుంచి నెలకు రూ.1000 చొప్పున జీవనభృతి అందజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది ఒంటరి మహిళలకు నెలకు రూ.1.30 కోట్ల చొప్పున జీవనభృతి అందుతోంది.



క్రీడలంటే ఎంతో ఆసక్తి. ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచి ఆటలంటే మక్కువ పెంచుకున్నారు. పట్టుదల, కృషితో అథ్లెటిక్స్‌లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. నిరంతర సాధనతో 8 సార్లు జాతీయ, రెండు సార్లు అంతర్జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొని సత్తా చాటారు. నాలుగు రజత, రెండు స్వర్ణ పతకాలు సాధించారు. అమెరికాలో నిర్వహించిన అంతర్జాతీయ పోలీసు క్రీడల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్యపతకాన్ని సాధించారు. ఆయనే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రానికి చెందిన మహ్మద్‌బాబా.

బాబా పరుగు పెడితే పతకాలే

అంతర్జాతీయ పోలీసు క్రీడల్లో కాంస్యం కైవసం



న్యూస్‌టుడే, కామారెడ్డి క్రీడావిభాగం

ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్‌బాబా తల్లిదండ్రులు సుభానీ బేగం, మహ్మద్ హుస్సేన్. పేద కుటుంబం వారిది. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు స్థానిక జీవధాన్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియేట్ కామారెడ్డిలో చదివారు. డిగ్రీ ఖమ్మం జిల్లా కేంద్రంలో పూర్తి చేశారు. 2009లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఆగస్టు 2016 నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రంలో స్పెషల్ పార్టీలో విధులు నిర్వర్తిస్తున్నారు.

జాతీయ స్థాయిలో ....

☛ 2004 నుంచి 2008 వరకు ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో శిక్షణ పొందుతూనే ఐదు సార్లు సీనియర్ నేషనల్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. ఒక సారి రజతం, రెండు సార్లు స్వర్ణాలు సాధించారు.

☛ 2013 ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో జరిగిన ఆలిండియా పోలీసు మీట్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ నుంచి ప్రాతినిధ్యం వహించి 100 మీటర్ల పరుగుపందెంలో స్వర్ణ పతకం గెలుపొందారు.

☛ 2014లో కామన్ వెల్త్ క్రీడలకు సైతం ఎంపికయ్యారు.

☛ 2015లో కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన అథ్లెటిక్స్‌లో ప్రత్యేక క్రీడా అంశంపై శిక్షణ పూర్తి చేసి.. శిక్షకుడి అర్హత పట్టా పొందారు.

☛ 2017లో వంద మీటర్ల పరుగు పందెం, 110 మీటర్ల హర్డిల్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి భారతదేశ అథ్లెటిక్స్ బృందానికి ప్రాతినిధ్యం వహించారు.

☛ ఈ నెల అమెరికా దేశం లాస్‌ఏంజెల్స్ వేదికగా జరిగిన ప్రపంచ పోలీసు అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్ విభాగంలో తలపడ్డారు. మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. 110 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం సాధించారు.



ఎస్పీ శ్వేత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మహ్మద్‌బాబా

నిరుపేద క్రీడాకారులను తీర్చిదిద్దుతాను

- మహ్మద్ బాబా, అంతర్జాతీయ క్రీడాకారుడు

గ్రామీణ నిరుపేద క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతాను. పోలీసు ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ టోర్నీల్లో పాల్గొని ఈ పతకాలు సాధించాను. నిరుపేద గ్రామీణ క్రీడాకారులకు అండగా నిలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. నిత్యం సాధన చేయడం వల్లే ఈ స్థాయిలో ఉన్నాను.

జయ జయ జయహే

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. పోలీస్ మైదానంలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు.



నందిపేట కేజీబీవీ విద్యార్థుల నృత్య ప్రదర్శన




జానపద నృత్యం..



ఆర్మూర్‌లో భరతమాత, జాతీయ నాయకుల వేషధారణలు



తెలంగాణ తల్లి వేషధారణలో...



కార్యక్రమానికి వచ్చిన స్వాతంత్ర్య సమరయోధులు



సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న యువతి





బోధన్‌లో అమ్మాయిల దరువు



తిలకిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, మేయర్ సుజాత, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, ఆకుల లలిత, జడ్పీ ఛైర్మన్ రాజు, వైస్ ఛైర్మన్ గడ్డం సుమనారెడ్డి



బోధన్‌లో మానవతా సదన్ చిన్నారులతో సబ్‌కలెక్టర్ సిక్తా పట్నాయక్



నిజామాబాద్ పరేడ్ మైదానంలో ...



బోధన్‌లో యోగాసనాల ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన




భార్య, కుమార్తెతో కార్యక్రమాలను తిలకిస్తున్న సీపీ కార్తికేయ



తల్లి, కుమార్తెతో వేడుకలను తిలకిస్తున్న కలెక్టర్ యోగితారాణా



బోధన్‌లో ..



ఆకట్టుకుంటున్న ఉద్యాన శాఖ శకటం

మహిళా వేధింపులపై అవగాహన కల్పిస్తూ..





ప్రదర్శనలో వ్యవసాయ శాఖ శకటం



వెయ్.. చిందెయ్..



కమ్మర్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన





తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ధర్మారం విద్యార్థినుల నృత్యాలు..



స్వాతంత్ర్య సమరయోధుల కాళ్లు మొక్కుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



తెవివిలో జెండా వందనం చేస్తున్న వీసీ సాంబయ్య, రిజిస్ట్రార్ విద్యావర్ధిని

బాధ్యతకు గుర్తింపు



మంత్రి నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో వెంకట్

బి.ఆర్.నర్సింగ్‌రావు, పీడీ, ఆర్మూర్

శ్రీనాథ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నిజామాబాద్.

ఎ.రవీందర్‌రెడ్డి, జేసీ

వెంకటేశ్వర్లు పీడీ, డీఆర్‌డీఏ

టి.సోమయ్య, సహాయకులు, దేవాదాయశాఖ

ప్రభాకర్, బాలభవన్ సూపరింటెండెంట్



సునంధరాణి, డీడీ, ఉద్యాన శాఖ

ప్రతిమారాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి

వినోద్‌కుమార్, నిజామాబాద్ ఆర్డీవో

ఎన్.వి. సాంబయ్య, 7వ బెటాలియన్, డిచ్‌పల్లి

గోవింద్, జిల్లా పరిషత్ సీఈవో

చతుర్వేది, కార్మికశాఖ డీసీ

వాజీద్ హుస్సేన్, జిల్లా జేడీఏ

సత్యనారాయణ, ఏడీ, భూగర్భ జలశాఖ

బాలిక్ హైమద్, పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జి జేడీ



రమేష్, ఈఈ, మిషన్ భగీరథ

జలేంధర్, డీఈఈ, పంచాయతీరాజ్

శ్రీధర్, ఏవో, కలెక్టర్ కార్యాలయం

రషీద్, సూపరింటెండెంట్, కలెక్టర్ కార్యాలయం

రమణ్‌రెడ్డి, ఏవో, మీసేవ

సాయిస్నేహిత్‌గౌడ్, జూ॥ అసిస్టెంట్, కలెక్టర్ కార్యాలయం

సంజీవ్, డ్రైవర్, కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ హన్మంత్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్

బావయ్య, తహసీల్దార్, భీమ్‌గల్



రాజేంధర్, తహసీల్దార్, ఆర్మూర్

గంగాధర్, తహసీల్దార్, బోధన్

వేణుగోపాల్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్,

ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్, మోపాల్

శ్వేత, డీటీ, ఆర్డీవో కార్యాలయం నిజామాబాద్

ముజీబ్, డీటీ, వర్ని

స్రవంతి, జూనియర్ అసిస్టెంట్, సబ్ కలెక్టర్ కార్యాలయం బోధన్

విఠల్, తహసీల్దార్, కోటగిరి

రవిమోహన్‌భట్, ఎఫ్ఆర్‌వో, నిజామాబాద్



సంజీవ్, ఎంపీడీవో నిజామాబాద్

సురేందర్, ఎంపీడీవో, డిచ్‌పల్లి

సీతామహాలక్ష్మీ, ఎంపీడీవో, జక్రాన్‌పల్లి

శ్రీనివాస్, ఎంపీడీవో, సిరికొండ

వేణుగోపాల్, ఎంపీడీవో, వర్ని

మల్లారెడ్డి, ఎంపీడీవో, బోధన్

డాక్టర్ సునీతాదేవి, హెచ్‌వోడీ, ప్రభుత్వ ఆసుపత్రి

డాక్టర్ తిమ్మారెడ్డి, హెచ్‌వోడీ, ఆర్థోపెటిక్, నిజామాబాద్

డాక్టర్. కిరణ్, మత్తు డాక్టర్



డాక్టర్ దివ్య, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రుద్రూర్.

హరికృష్ణ, డీఎం, సివిల్ సప్లయి కార్పొరేషన్

ఏడు కొండలు, ఐ అండ్ పి.ఆర్

హరి స్వరూప్, ఏఈఈ, ఇరిగేషన్

విజయ్‌కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

సంగీత, ప్రిన్సిపల్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల

ప్రసన్నలత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

సయ్యద్ ఇస్మాయిల్, ఓ.ఎస్. పశుసంవర్ధకశాఖ

నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్



పద్మనాభం, నోడల్ అధికారి, డీఈవో

సుహాసిని, అసిస్టెంట్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్ శాఖ

ప్రభాకర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

భాస్కర్, జూనియర్ వెటర్నరీ అధికారి

కిషన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు

లక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్మూర్

వై.జయశ్రీ, ఇన్నర్‌విల్ క్లబ్ అధ్యక్షురాలు

శంకర్, జడ్పీహెచ్ఎస్. ఓన్నాజీపేట

పుష్పలత, టీచర్, బాలభవన్



యశ్వంత్‌రావ్, ఏఈ, విద్యుత్తుశాఖ. ముప్కాల్

గంగామణి, హౌస్‌కీపర్, మానవతా సదన్, డిచ్‌పల్లి

స్రవంతి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు

వసంత్‌రావు, డిప్యూటీ తహసీల్దార్, పౌరసరఫరాల శాఖ

స్నేహ, ఏఈవో, పడగల్

వసంతలక్ష్మీ, ఏఈవో, పిప్రి

దస్రూనాయక్, మేనేజర్, డెయిరీ, నిజామాబాద్

సాయినాథ్, ఎస్.ఐ. రైల్వే పీఎస్

యాదగిరి, వార్డెన్, నిజామాబాద్

ఆరంభ శూరత్వం



శిథిలావస్థకు చేరిన ఐటీఐ భవనం

● ప్రారంభించారు... మరచి పోయారు
● నాలుగేళ్లయినా మొదలు కాని ఐటీఐ
● ప్రకటనలకే పరిమితమైన ఉద్యోగుల నియామకం

యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే పారిశ్రామిక శిక్షణా సంస్థ ఏర్పాటుకు హడావుడి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆపై కిమ్మనకుండా ఉండిపోయారు..నాలుగేళ్ల తర్వాత శిక్షకుల నియామకం చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకుంది..కానీ ఇంతవరకు కళాశాలలో తరగతులు మొదలే కాదు..ఆరంభశూరత్వంతోనే ఐటీఐ మిగిలిపోయింది..!

పరిశీలన

– న్యూస్‌టుడే, బిచ్కుంద

విద్యారంగంతో పాటు పారిశ్రామిక శిక్షణా సంస్థలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తామని పేర్కొంటున్న ప్రభుత్వం వాటి గురించి మరచిపోయింది. రాష్ట్రం, జిల్లా ఏర్పాటయినా ఐటీఐ కల సాకారం కావడం లేదు. కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రాన్ని (ఐటీఐ) బిచ్కుందలో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కానీ ఏ గ్రేడ్‌లోనూ ఇంతవరకు ప్రవేశాలు జరగకపోవడమే విచిత్రంగా మారింది.

♦ బిచ్కుంద మండలంలో చిన్నదడ్గి గేటు సమీపంలో నాలుగేళ్ల క్రితం రూ 2.52 కోట్ల వ్యయంతో భవనం సముదాయం నిర్మించారు

♦ ఈ భవనాన్ని 2013లో అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు

♦ భవనం నిర్మించిన తర్వాత అధికారులు దానివైపు కన్నెత్తి చూడలేదు.



విద్యుత్తు పరికరాల చోరీ

♦ బిచ్కుందకు మూడు కిలోమీటర్ల దూరంలో భవనం నిర్మించడం, దానిని ఎవరూ పట్టించుకోకపోవడంతో శుభకార్యాలకు వినియోగిస్తున్నారు.

♦ కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల లేకపోవడం.. నిజామాబాద్ జిల్లాలో మాత్రమే ఐటీఐ కళాశాల ఉండడంతో అక్కడ సీట్లు దొరక్క విద్యార్థులు ప్రైవేటు కళాశాలలో చేరుతున్నారు

♦ కళాశాల భవనంలో అన్ని రకాల వసతులు కల్పించినా అధికారులు ఇక్కడ అధ్యాపకుల పోస్టులు నియమించకపోవడంతో గత కొన్నేళ్లుగా భవనం వృథాగా మారింది.

♦ గత సంవత్సరం ఐటీఐ కళాశాలకు అధ్యాపకుల నియామకం చేపట్టినట్లు ప్రకటనలు ఇచ్చినా ఇంత వరకు ఎలాంటి నియామకాలు చేయలేదు.

♦ గత నెలలో ఐటీఐ కళాశాలలో 18 మంది అధ్యాపకులు, ఇతర సిబ్బంది నియామకం జరిగినట్లు ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ప్రకటన ఇచ్చారు

♦ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలైంది. ఇప్పటికే విద్యార్థులు ప్రైవేటు కళాశాలలో చేరిపోయారు. అధికారులు ఇప్పుడు అధ్యాపకుల నియామకాలు చేపట్టినా విద్యార్థులు వచ్చే అవకాశాలు చాలా తక్కువ.



ప్రమాదకరంగా మారిన విద్యుత్తు నియంత్రిక

సకాలంలో నియామకం చేపడితే

ఐటీఐ కళాశాలలో అధ్యాపకుల నియామకం సకాలంలో చేపడితే బాగుండేది. కళాశాలలు ప్రారంభమై మూడు నెలలు కావొస్తుంది. ఐటీఐలో చేరాలనుకుంటున్న విద్యార్థులకు ఇతర కళాశాలలో సీటు రాకపోవడంతో నిరుత్సాహంతో మరో దాంట్లో చేరారు. అధ్యాపకులు కళాశాలలో చేరిన తర్వాత తరగతులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో	
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	: 437
విద్యార్థుల సంఖ్య	: 35 వేలు
పది పాసైన వారి సంఖ్య	: 32 వేలు
ప్రైవేటు ఉన్నత పాఠశాలలు	: 418

సెప్టెంబరులో ప్రారంభిస్తాం..

అధికారుల సమన్వయలోపంతో బిచ్కుందలోని ఐటీఐ కళాశాల ప్రారంభం ఆలస్యం జరిగింది. ఈ సంవత్సరం సెప్టెంబరులో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం. ఈ కళాశాల ఎన్‌సీవీటీ ప్రత్యేక పరిధిలో ఉండడంతో ప్రవేశాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఐటీఐలో పూర్తిస్థాయిలో అధ్యాపకుల నియామకం పూర్తయ్యింది. భవనాన్ని పరిశీలించి వసతులను సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటాం. **- నారాయణ, ఐటీఐ జేడీఏ హైదారాబాద్. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, బిచ్కుంద**

త్వరలోనే ప్రారంభించే విధంగా చర్యలు..

కామారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటి ఐటీఐ కళాశాల బిచ్కుందలో ఏర్పాటు చేశాం. గత నెలలో ప్రభుత్వం కళాశాలలో అధ్యాపకులతో పాటు ఇతర సిబ్బందిని నియమించింది. కళాశాలకు ఐటీఐ జేడీఏ నారాయణను ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే కళాశాలలో ప్రత్యేక ప్రవేశాలు చేసుకొనే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. **- ఎమ్మెల్యే హన్మంత్ షిండే**



విద్యార్థుల ప్రయోగాల కోసం నిర్మించిన షెడ్లు

సామర్థ్యం+శిక్షణ=విజ్ఞానం

● ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యపై దృష్టి ● విద్యార్థుల్లో అభ్యాసన స్థాయి పెంపుపై కసరత్తు ● సత్ఫలితాల కోసం అధికారుల కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాల కల్పన పక్కన పెడితే 70 శాతం మందికి చదవడం, రాయడం సరిగ్గా రాదనే వాదన ఉంది. దీన్ని పటాపంచలు చేసే దిశగా విద్యాశాఖ నడుం బిగించింది. చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు 3 ఆర్ పేరిట 60 రోజుల కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆగస్టు 1న ఉమ్మడి జిల్లాలో నూతన కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు.

– (న్యూస్‌టుడే, సదాశివనగర్)

ఉమ్మడి జిల్లాలోని 2526 ప్రభుత్వ పాఠశాలల్లోని 3 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అభ్యసనా స్థాయి పెంపునకు ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి 60 పనిదినాలు శిక్షణను ప్రారంభించారు. శిక్షణలో విద్యార్థులకు తెలుగు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం చేసే విధానం నేర్పిస్తారు. ఆయా తరగతుల విద్యార్థులకు ఒక పరీక్ష నిర్వహించారు. ఏ,బీ గ్రూప్‌లుగా విభజన చేశారు. రెండు గ్రూప్‌ల వారికి బోధన చేయడానికి శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందుగానే ఉపాధ్యాయులకు అభ్యసనా సామర్థ్యాల పెంపుదలపై శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. అందరు ఉపాధ్యాయులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పు తీసుకొని రావడం, ప్రతి విద్యార్థిలో విద్యా ప్రమాణాలు, సామర్థ్యం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం గుణాత్మక విద్యా బోధనకు తెర లేపింది. దీని అమలుకు చదవడం, రాయడం, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం చేసే సామర్థ్యాలను కలిపి 3 ఆర్ అని నామకరణం చేశారు. తెలుగు, ఆంగ్లం, గణితం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 60 పని దినాల్లో కచ్చితంగా పాటించేలా జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నతాధికారులు పక్కాగా నిఘా ఉంచినప్పుడే ఆచరణలో ఇది లక్ష్యాన్ని సాధిస్తుంది. లేకపోతే నీరు గారిపోయే ప్రమాదం లేకపోలేదు.



సదాశివనగర్‌లో పాఠ్యాంశాలు వింటున్న విద్యార్థులు

కార్యాచరణ ప్రణాళిక ఇలా...

మొదటి విభాగంలో చదవడం, రాయడం రాని విద్యార్థులపై రోజూ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెడతారు. వీరికి ఒత్తులు, అక్షరాలు, అంకెలు, సంఖ్యలు గుర్తించేలా చేయడంతో పాటు వాక్యాలను చదవడం, రాయడం నేర్పిస్తారు. రెండో విభాగంలో చదవడం, రాయడం వచ్చిన విద్యార్థులకు స్వీయ రచన, సృజనాత్మకత కృత్యాలపై అభ్యాసనం చేయిస్తారు. గణితంలో దశాంశాలు, భిన్నాలు పోల్చడం, సహజ, పూర్ణ సంఖ్యలు, బీజగణితాన్ని ప్రధానంగా నేర్పిస్తారు. ఉదయం పూట పుస్తక పాఠ్యాంశాల బోధన చేస్తున్నారు. మధ్యాహ్నం మూడు తరగతులు 3 ఆర్ కు కేటాయించి బోధన కొనసాగిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులకు మేలు



చదువులో వెనుకబడిన విద్యార్థులకు 3 ఆర్ పేరిట చేపట్టిన కార్యక్రమం వల్ల మేలు జరుగుతుంది. ప్రతి విద్యార్థికి తప్పని సరిగా చదవడం, రాయడం వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. విద్యార్థులు స్వీయరచన, సృజనాత్మకత కృత్యాలపై అభ్యాసం చేయిస్తే ప్రయోజనం కలుగుతుంది.

- రజిత, విద్యార్థిని, 8వ తరగతి.

సక్రమంగా అమలైతే మంచి ఫలితాలు



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఈ కార్యాచరణ తప్పక చేయూతను అందిస్తుంది. సక్రమంగా అమలు చేసే విధంగా ఉపాధ్యాయులు చూడాలి. సరళ పదాలు నేర్పడానికి వారం రోజులు చాలు. అభ్యసనాభివృద్ధి, కనీస సామర్థ్యాల సాధన కోసం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఉపాధ్యాయుడు ఆచరించాలి. సబ్జెక్టుల వారీగా రోజూ ప్రణాళిక ప్రకారం బోధన చేయాలి. సక్రమంగా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

- రాజిరెడ్డి, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు

పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు



విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు 3 ఆర్ పేరిట 60 రోజుల కార్యక్రమం పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజు పలు పాఠశాలలను పర్యవేక్షణ చేస్తాను. ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షణ చేసే వీలు ఉంటుంది. ఉపాధ్యాయులు తమ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం పెంచే విధంగా కృషి చేయాలి. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి సమష్టిగా ఉపాధ్యాయులు కృషి చేస్తే బాగుంటుంది.

- మదన్ మోహన్, జిల్లా విద్యాధికారి, కామారెడ్డి



ముఖ్యమైన తేదీలు

★ యూపీఎస్సీలోని వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి: 31 ఆగస్టు
★ ఇంటెలిజెన్స్ బ్యూరోలోని ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి: 2 సెప్టెంబరు
★ నిట్ రూర్కెలాలోని ఉద్యోగాలకు చివరి తేదీ: 11 సెప్టెంబరు
★ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నాన్‌టీచింగ్ పోస్టులకు: 18 సెప్టెంబరు

ప్రతిభ

3562 ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఉద్యోగాలు Jobs

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రెయినీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

★ మొత్తం ఖాళీలు: 3562
★ అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదు సంవత్సరాలు, ఓబీసీ (నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడు సంవత్సరాలు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పది సంవత్సరాలు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
★ ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష (ప్రిలిమ్స్, మెయిన్స్), ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్ష విధానం:
★ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు, 30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు, 35 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు, 35 మార్కులు) నుంచి మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు: 100. కాల వ్యవధి: 1 గంట.
★ మెయిన్ ఎగ్జామినేషన్: రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (45 ప్రశ్నలు, 60 మార్కులు, 60 నిమిషాలు), జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు, 40 మార్కులు, 35 నిమిషాలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (35 ప్రశ్నలు, 40 మార్కులు, 40 నిమిషాలు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (35 ప్రశ్నలు, 60 మార్కులు, 45 నిమిషాలు) నుంచి మొత్తం 155 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 200. కాల వ్యవధి: 3 గంటలు. ఇవి కాక ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే) నుంచి 25 మార్కులకు రెండు ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల వ్యవధి ఉంటుంది.
★ ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.
★ దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.100, ఇతరులు రూ.600 దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.
★ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు: అక్టోబరు 7, 8, 14, 15
★ మెయిన్ ఎగ్జామినేషన్: 26 నవంబరు
★ తెలుగు రాష్ట్రాలకు పరీక్ష కేంద్రాలు (ప్రిలిమ్స్): చీరాల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
★ మెయిన్స్: గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

★ చివరి తేదీ: **5 సెప్టెంబరు**
వెబ్‌సైట్: **www.ibps.in**

నిట్, రూర్కెలాలో 203 ఖాళీలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూర్కెలా ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యుమానిటీస్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✲ మొత్తం ఖాళీలు: 203 (అన్‌రిజర్వ్‌డ్ - 55, ఎస్సీ - 40, ఎస్టీ - 26, ఓబీసీ - 82)
✲ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
✲ ఖాళీ ఉన్న విభాగాలు/ స్పెషలైజేషన్స్/ అకడమిక్ గ్రూప్‌లు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, సెరామిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.

అర్హతలు: ఇంజినీరింగ్ విభాగాల్లో పోస్టులకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

★ ఇండస్ట్రియల్ డిజైన్‌కి 60 శాతం మార్కులతో బీటెక్/ బీడీఈఎస్‌తోపాటు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ అవసరం.
★ ఆర్కిటెక్చర్ విభాగానికి ప్రథమ శ్రేణిలో బీఆర్క్, ఎంఆర్క్/ పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ సైన్స్/ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పోస్టులకు మేనేజ్‌మెంట్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏ/ పీడీడీబీఎం తోపాటు పీహెచ్‌డీ అవసరం.
★ ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

చివరి తేదీ: **11 సెప్టెంబరు**
వెబ్‌సైట్: **nitrkl.ac.in**

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ మొత్తం ఖాళీలు: 15.
★ డాక్యుమెంటేషన్ కమ్ టెక్నికల్ అసిస్టెంట్/ లైబ్రేరియన్ - 1.
★ సీనియర్ అసిస్టెంట్ - 2 (ఏదైనా డిగ్రీతోపాటు సంబంధిత విభాగంలో అనుభవం అవసరం).
★ జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ - 1.
★ స్టెనోగ్రాఫర్ - 4 (ఏదైనా డిగ్రీతోపాటు లోయర్ స్టెనోగ్రఫీ, టైప్ రైటింగ్‌లో సర్టిఫికెట్, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం).
★ ల్యాబొరేటరీ అటెండెంట్ - 1.
★ ప్రొఫెషనల్ అసిస్టెంట్ - 2. (లైబ్రరీ సైన్స్/ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన అర్హతతోపాటు అనుభవం ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
★ జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ - 1.
★ లైబ్రరీ అటెండెంట్ - 2 (ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన అర్హతతోపాటు సంబంధిత విభాగంలో సర్టిఫికెట్ అవసరం).
★ మెస్ సూపర్‌వైజర్ - 1.
★ దరఖాస్తు: 18 ఆగస్టు నుంచి 18 సెప్టెంబరు వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: **29 సెప్టెంబరు**

★ వెబ్‌సైట్: **uohyd.ac.in**

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1300 ఖాళీలు



కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ (గ్రేడ్-2)/ ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ 2017 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

★ **పోస్టు పేరు:** అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్/ ఎగ్జిక్యూటివ్
★ **ఖాళీలు:** 1300 (అన్ రిజర్వ్‌డ్ - 951, ఓబీసీ - 184, ఎస్సీ - 109, ఎస్టీ - 56).
★ **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే మంచిది.
★ **వయసు:** 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
★ **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ **పరీక్ష విధానం:** టైర్ - 1, టైర్ - 2 అనే రెండు రాత పరీక్షలు నిర్వహిస్తారు.
★ **టైర్ – 1:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/ ఎనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. 100 మార్కులు. వ్యవధి: 60 నిమిషాలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. టైర్ - 1లో అర్హత సాధించిన అభ్యర్థులకు టైర్ - 2 పరీక్ష నిర్వహిస్తారు.
★ **టైర్ – 2:** డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. ఎంపిక చేసిన అంశంపై ఎస్సే రాయాల్సి ఉంటుంది (దీనికి కేటాయించిన మార్కులు 30). మరో ప్రశ్నగా 20 మార్కులకు ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ అండ్ ప్రిసైజ్ రైటింగ్ ఉంటుంది. మొత్తం వ్యవధి - 60 నిమిషాలు.
★ టైర్ - 2లో అర్హత సాధించిన అభ్యర్థులకు 100 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ తెలుగు రాష్ట్రాలకు పరీక్ష కేంద్రాలు: విజయవాడ, హైదరాబాద్.
★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

★ **చివరి తేదీ: 2 సెప్టెంబరు**
★ **వెబ్‌సైట్: www.mha.nic.in**

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ అప్లికేషన్ ద్వారా కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ అసిస్టెంట్ డైరెక్టర్ (కెమిస్ట్రీ) - 1.
★ అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్ - 1, మెకానికల్ - 2).
★ స్పెషలిస్ట్ గ్రేడ్ 3 అసిస్టెంట్ ప్రొఫెసర్ (అనాటమీ - 8, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 13, ఆప్తల్మాలజీ - 3, ఆర్థోపెడిక్స్ - 1, పీడియాట్రిక్ కార్డియాలజీ - 2, రేడియో థెరపీ - 10).
★ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ - 6.
★ డ్రిల్లర్ ఇన్‌ఛార్జ్ - 5.
★ లెక్చరర్ (మెకానికల్ - 1, ఎలక్ట్రికల్ - 1).
★ అర్హతలు, వయసు మొదలైన వివరాల కోసం వెబ్‌సైట్ చూడొచ్చు
★ ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.

★ **చివరి తేదీ: 31 ఆగస్టు**
★ వెబ్‌సైట్: **www.upsconline.nic.in**

ఎగ్జిక్యూటివ్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ కింది ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనుంది.

★ హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ - 20
★ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ - 5
★ అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ - 2
★ ఎంపిక: యూజీసీ - నెట్ నవంబరు 2017లో సాధించిన స్కోరు ఆధారంగా.
★ అర్హతలు, వయసు మొదలైన పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడొచ్చు

★ వెబ్‌సైట్: **www.ongcindia.com**

Mail your feedback to
pratibhadesk@eenadu.net

ప్రవేశాలు

యూజీసీ నెట్ - 2017

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్/ జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ అర్హత కోసం నిర్వహించే యూజీసీ - నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నవంబరు 2017)కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

★ అర్హత: హ్యుమానిటీస్/ సోషల్ సైన్స్/ మేనేజ్‌మెంట్/ సైన్స్/ ఆర్ట్స్ విభాగాల్లో 55 శాతం మార్కులతో పీజీ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: అసిస్టెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి లేదు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 1 నవంబరు 2017 నాటికి 28 సంవత్సరాలకు మించకూడదు.
★ పరీక్ష ఫీజు: జనరల్ అభ్యర్థులు రూ.1000, ఓబీసీ అభ్యర్థులు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.250 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
★ పరీక్ష విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే ఈ పరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి.
★ పేపర్ - 1: 50 ప్రశ్నలు, 100 మార్కులు, సమయం 1 గంట 15 నిమిషాలు.
★ పేపర్ - 2: 50 ప్రశ్నలు, 100 మార్కులు, సమయం 1 గంట 15 నిమిషాలు
★ పేపర్ - 3: మొత్తం మార్కులు 150. 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 2.30 గంటలు.
★ తెలుగు రాష్ట్రాలకు పరీక్షా కేంద్రాలు: గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
★ పరీక్ష తేదీ: 5 నవంబరు

★ **చివరి తేదీ: 11 సెప్టెంబరు**
వెబ్‌సైట్: **cbsenet.nic.in**

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ ఖాళీలు: సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఓవర్‌సీర్) - 21.
★ అర్హత: మెట్రిక్యులేషన్/ తత్సమాన ఉత్తీర్ణతతోపాటు సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా అవసరం.
★ వయసు: 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. ★ చివరి తేదీ: **22 సెప్టెంబరు**

★ వెబ్‌సైట్: **www.itbpolice.nic.in**

IBPS - RRBs Recruitment

No. of Questions: 80 | Maximum Marks: 80 | Time: 45 Mts.

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

Directions (Q.66 - 70): Study the following information carefully to answer the given questions.

In a college, there were 700 students in 2012. The college offers Engineering in five specializations - Computer Science, Civil, Electrical, Mechanical and Biotechnology. Out of the total number of male students in the college, 30% study Computer Science, 15% study Civil, 18% study Electrical, 12% study Mechanical and the remaining students study Biotechnology. Out of the total number of female students in the college, 35% study Computer Science, 5% study Civil, 20% study Electrical and 15% Study Mechanical. There are 75 female students in Biotechnology.

66. The number of male students in Biotechnology is what percent more than the number of female students studying in the same course?

1) $35\frac{1}{2}$ 2) $37\frac{1}{6}$ 3) $33\frac{1}{3}$
4) $35\frac{1}{8}$ 5) $34\frac{1}{6}$

67. What is the respective ratio between the male students in Computer Science and the number of female students studying in the same course?



1) 15 : 8 2) 13 : 9 3) 8 : 7
4) 10 : 9 5) 4 : 3

68. What is the difference between the total number of female students in Electrical and Mechanical together and total number of males studying in the same courses together?

1) 12 2) 19 3) 15
4) 11 5) 17

69. The total number of male students in Civil and Computer Science together is what percent of the total number of students (male and female) studying in these two courses together?

1) 66 2) 62.5 3) 64
4) 65 5) 60

70. What is the average number of students (male and female) in Mechanical and Biotechnology?

1) 132 2) 124 3) 134
4) 128 5) 138

Directions (Q.71 - 75): What approximate value will come in place of the question mark (?) in the following questions? (You are not expected to calculate the exact value.)

71. 465.84 + 764.86 – 211.99 = ?

1) 1100 2) 1080 3) 1000
4) 1020 5) 1060

72. 149.9% of 149.9 + 149.9 = ?

1) 375 2) 400 3) 350
4) 425 5) 450

73. 3001 × 749 ÷ 1001 – 1399 = ?

1) 650 2) 700 3) 950
4) 850 5) 1000

74. $\sqrt{2642} - \sqrt{1156} + \sqrt{459} = ?$

1) 50 2) 90 3) 40
4) 20 5) 30

75. $\frac{901}{29} \times \frac{91}{301} \div \frac{51}{599} = ?$

1) 140 2) 120 3) 60
4) 80 5) 110

76. A man sold a wristwatch for Rs.2,400 at a loss of twenty five percent. At what rate should he have sold the wrist-watch to earn a profit of twenty five percent?

1) Rs.3,600 2) Rs.4,000
3) Rs.3,500 4) Rs.3,800
5) None of these

77. The average of five numbers is 56. If the average of first four numbers is 54, what is the value of the fifth number?

1) 68 2) 72 3) 56
4) 64 5) None of these

78. If a number is added to seven-ninth of thirty five percent of 900, the value so obtained is 325. What is the number?

1) 60 2) 120 3) 90
4) 180 5) None of these

79. The ratio between the three angles of a quadrilateral is 1 : 4 : 5 respectively. The value of the fourth angle of the quadrilateral is 60°. What is the difference between the value of the largest and the smallest angles of the quadrilateral?

1) 120° 2) 90° 3) 110°
4) 100° 5) None of these

80. What least number should be subtracted from 1740, so that it will be completely divisible by 88?

1) 156 2) 68 3) 58
4) 146 5) None of these

Key

66-3	69-5	72-1	75-5	78-5
67-3	70-3	73-4	76-2	79-1
68-3	71-4	74-3	77-4	80-2.

Explanations

1. A ≤ R ≤ N = G ≥ T > S

Conclusions

I. A < S: Not True

II. A = S: Not True

(2-3):

C > R ≤ E = T

R < Y; U ≥ E

C > R < Y

Y > R ≤ E ≤ U

C > R ≤ E = T ≤ U

2. Conclusions

I. C > Y: Not True

II. U ≥ Y: Not True

3. Conclusions

I. U ≥ R: True

II. T ≤ U: True

(4 – 5):

P ≥ R = B ≤ S

C ≤ B > Z

P ≥ R = B > Z

Z < R = B ≤ S

C ≤ B ≤ S

4. Conclusions

I. Z = P: Not True

II. S ≤ Z: Not True

5. Conclusions

I. C < S: Not True II. C = S: Not True

C is either smaller than or equal to S. Therefore, either Conclusion I or Conclusion II follows.

6.

$L \xrightarrow{+3} O \xrightarrow{-5} J$

$F \xrightarrow{+3} I \xrightarrow{-5} D$

$R \xrightarrow{+3} U \xrightarrow{-5} P$

$I \xrightarrow{+3} L \xrightarrow{+2} N$

$C \xrightarrow{+3} F \xrightarrow{-5} A$

7.

$B \xrightarrow{+1} C \xrightarrow{+2} E \xrightarrow{+3} H \xrightarrow{+4} L \xrightarrow{+5} \boxed{Q}$

(8 – 10):

7th	G
6th	C
5th	D
4th	A
3rd	F
2nd	E
1st	B

8. G lives on the topmost floor.

9. C lives immediately above D's floor.

10. F, D. B and G live on odd numbered floor. C lives on even numbered floor.

(11 – 15):

Person	Pen	Car	Watch
Suman	Parker	Mica	Samay
Mrudula	Cello	City	Citizen
Amir	Lamy	Santro	Timex
Veena	Lexi	WagonR	Titan
Harsh	Pointer	Swift	Fastrack

11. Suman likes Samay watch.

12. Harsh likes Pointer pen.

13. Harsh likes Fastrack watch.

14. Harsh likes Swift car.

15. Veena likes Titan watch.

16. It is requested to send another type of letter. It implies that format and emphasis of different types of letters is different. Again, it is clearly mentioned to send an official letter rather than semi-official letter on this subject.

Therefore, it is possible to send different types of letters on the same subject.

17. Only assumption I is implicit in the statement. The details of passengers are required for booking the tickets.

18. Clearly, both the assumptions are implicit in the statement.

19. The date of birth of Yasir is February 29. It means he was born in a Leap Year.

From statement I:

Leap Year between 2005 and 2011 was 2008.

From statement II:

2012 - 4 = 2008 and 2008 was a Leap year.

20. From statement I:

Out of 42 students, 38 play both chess and cricket and the remaining four play only cricket. Therefore, no student plays only chess.

(21-25):

Left Q R T X U P W V S Right
(all facing ↑)

21. V sits seventh to the right of Q.

22. Q and S are seated at two extreme ends of the line.

23. Three persons - T, X and U - are seated between R and P.

24. T sits fifth to the left of V. Q sits fifth to the left of P. X sits fifth to the left of S.

25. Seventh from the left ⇒ W

Fifth from the right ⇒ U

P sits exactly between U and W.

(26 – 30):

Day	Person	City
Monday	R	New York
Tuesday	M	Bangkok
Wednesday	S	Tokyo
Thursday	O	Paris
Friday	P	Seoul
Saturday	N	Madrid
Sunday	Q	London

26. O attended Seminar on Thursday and Thursday – 1 = Wednesday.

N attended Seminar on Saturday and Saturday – 1 = Friday.

Q attended Seminar on Sunday and Sunday – 1 = Saturday.

S attended Seminar on Wednesday and Wednesday – 1 =Tuesday.

M attended Seminar on Tuesday and Tuesday + 2 = Thursday.

27. N attended Seminar in Madrid on Saturday.

28. P attended Seminar in Seoul on Friday.

29. The combination Thursday - O - Paris is correct.

30. R attended Seminar in New York on Monday.

M attended Seminar exactly between R and S.

P attended Seminar in Seoul on Friday.

31. The inference is definitely false. An example cannot support the inference.


32. The inference seems to be false as the use of term 'most' makes the inference doubtful. But the first part talks about the same.

33. Clearly, the inference is definitely true.

34. The advice is meant for all who are associated with business. Therefore, the inference is probably true.

35. In the passage it is mentioned that the author saw the film 'The wizard Oz' three times. It does not imply that he watches most movies more than twice.

36.



I. ✔✕ II. ✕✔

Either I or II follows.

(మిగతా వివరణలు రేపటి పేజీల్లో)

హాయ్! బుజ్జీ!!

ఒకే ప్రశ్న



'ఫాదర్ ఆఫ్ ఆయుర్వేద' అని ఎవరిని అంటారు?



ష్ష్ష్... సీల్స్ గుర్తుపట్టేస్తాయ్!

'చిన్నీ...' అంటూ అమ్మ మనల్ని పిలిచిందనుకోండి. అది అమ్మ గొంతని మనకు అర్థమైపోతుంది. అలానే మన బంధువులు, చుట్టుపక్కల వారు ఎవరు మాట్లాడినా ఆ గొంతు ఎవరిదో మనం గుర్తుపట్టేస్తాం. ఇది మన మనుషులకు మాత్రమే తెలిసిన విద్య అనుకుంటే పప్పులో కాలేసినట్లేనండోయ్. ఎందుకంటే ఈ పనిని ఓ రకం సీల్‌లు కూడా అవలీలగా చేసేస్తాయట. ఈ మధ్యే పరిశోధనల్లో ఈ గమ్మత్తైన సంగతి తెలిసింది.

❖ సముద్రాల్లో జీవించే సీల్ జలచరాలు తెలుసుగా? వాటిల్లో ఎలిఫెంట్ సీళ్లు అని ఓ రకానివి ఉన్నాయి. వీటిలో మగవాటి ముఖానికి ఏనుగు తొండంలాంటి చిన్న నిర్మాణం ఉండటంతోనే వీటికా పేరు.

❖ సముద్ర తీరాల్లో ఇవి వందల సంఖ్యలో మందలుగా జీవిస్తుంటాయి.

❖ మనం మన చుట్టుపక్కల వారితో ఎలాగైతే కలిసిమెలిసి ఉంటామో అలాగే ఒకే మందలో ఉన్నవన్నీ ఎంతో కలుపుగోలుగా ఉంటాయి.

❖ ఇంకా విచిత్రం ఏమిటంటే ఒక దాని గొంతును మరొకటి చక్కగా గుర్తుపట్టేస్తుంది. వచ్చిన శబ్దాన్ని బట్టి అది ఏ సీల్ చేసిన శబ్దమో కూడా మిగిలిన వాటికి తెలిసిపోతుందట. ఆ ధ్వనిని బట్టి అది ఏం చెప్పాలనుకుంటుందో కూడా అర్థం చేసుకుంటుందట.

❖ ఇక పిల్ల సీళ్లు కూడా వీటి శబ్దాల్ని అనుకరిస్తూ ఒక్కో భావానికీ ఒక్కో రకం శబ్దం చేయటం నేర్చేసుకుంటాయి.

❖ శాస్త్రవేత్తలు ఇవి చేసే ధ్వనులు, వాటికి పక్కవి ఎలా ప్రతిస్పందిస్తున్నాయనే విషయాల్ని రికార్డు చేశారు. దానిపై బోలెడు పరిశోధనలు చేసేసి ఈ చిత్రమైన విషయాల్ని బయటపెట్టారు.

మీకు తెలుసా?

- సీళ్లన్నింటిలో ఎలిఫెంట్ సీళ్లే పెద్దవి. వీటిలో సదరన్, నార్తర్న్ సీళ్లని మళ్లీ రెండు రకాలు.
- ఇవి మగవి 20 అడుగుల వరకు పొడవు, నాలుగు వేల కేజీలకుపైగా బరువు పెరుగుతాయి. అంటే మనిషికంటే చాలా పెద్దవన్నమాట.
- 20 ఏళ్లకు పైగా బతుకుతాయివి.
- మందకి కొన్ని మగ సీళ్లు నాయకత్వం వహిస్తాయి.
- వీటి జత సీళ్ల కోసం మగవాటి మధ్యలో పెద్ద యుద్ధాలే జరుగుతాయి.

ముత్యం

ఏదీ అంతిమ విజయం కాదు, తదుపరి ఆశయం, లక్ష్యం ఎప్పుడూ ఉండాలి, వాటి సాధన కోసమే కష్టించాలి

- అబ్రహం లింకన్

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Pure = శుద్ధమైన
- మక్కువ = ఇష్టం

నవ్వుల జల్లులు!



తండ్రి: ఎప్పుడూ నిద్రేమిట్రా నీకు?

రవి: మీరే కదా నాన్నా! కలలు కనాలి, వాటిని సాధించాలని చెప్పారు!

- *వాడపర్తి నవచరణ రాయుడు*, గొల్లలవలస



తండ్రి: వాసూ! ప్రోగ్రెస్ కార్డు నాకు చూపించలేదేం?

వాసు: ఆందోళన కలిగించే విషయాలేమీ మీకు తెలియనివ్వకూడదని డాక్టరుగారు అమ్మకు చెబుతుంటే విన్నా డాడీ!

- **పి.వి. రమణకుమార్**, చిలకలూరిపేట

గణ గణ గణ

ఏంటీ గంట మోత అనకండేం. ఎందుకంటే ఈ గంటకీ మోత మోగేటంత చరిత్ర ఉందండోయ్! అదేంటో తెలుసుకోవాలంటే తెచ్చేసుకోండి..



గబగబా అనండి!

- ▲ SANJEEV'S SIXTH SHEEP IS SICK
- ▲ DOUBLE BUBBLE GUM, BUBBLES DOUBLE.

చిలిపి ప్రశ్న



వినయ్ టూవీలర్‌లో పెట్రోల్ లేకపోయినా వేగంగా వెళుతున్నాడెలా?

- **సీహెచ్‌వీవీఎస్ మూర్తి**, పాల్వంచ

భాషకూ సంగీతానికీ సంబంధం ఉందా?



ప్రశ్న: **మనం మాట్లాడే భాషకు, సంగీతానికి ఏదైనా సంబంధం ఉందా?**

- *కె. లావణ్య*, కూచిపూడి



జవాబు: శాస్త్రజ్ఞుల్లో చాలా మంది భాషకు, సంగీతానికి అవినాభావ సంబంధం ఉందని నిర్ధారణకు వచ్చారు. మానవులకు సంగీతానికి స్వాభావికమైన అభినివేశం లేకపోతే వారు మాట్లాడే మాటల్లో శ్రావ్యత, స్వర మాధుర్యం ఉండేవి కావు. ఆ స్వర మాధుర్యమే లేకుంటే మాట్లాడే మాటలు రోబోల నుంచి వెలువడే మాటల్లా, కేవలం శబ్దాల్లా మాత్రమే ఉండేవి. అవి వారి మనోభావాలు, ఆవేశం, సంతోషం, దుఃఖాల్ని వ్యక్తీకరించ లేకపోయేవి.

మానవుల నోటి నుంచి వెలువడే ప్రతి మాటలో ఉదాత్తమైన ఉచ్చారణ, విరామం, స్వర స్థాయి, శ్రుతి ఉంటాయి. మాటలకు సంబంధించిన ఈ ధర్మాలన్నింటినీ కలిపి భాషా శాస్త్రవేత్తలు స్వర జ్ఞానం అంటారు. కాబట్టి మానవులు మాట్లాడే మాటలకు ఉండే ఈ స్వర జ్ఞానం సంగీతంలోని స్వరాలకు దగ్గరగా ఉంటుందని, దాంతో వారి మాటలు వారి మనసులోని భావాల్ని తెలుపుతూ లయబద్ధంగా ఉంటాయని శాస్త్రజ్ఞుల భావన. 'కొందరు మాట్లాడితే వీణ మీటినట్లుంటుంది' అనే వ్యక్తీకరణను మనం వింటుంటాం. ఇప్పటి వరకు జరిగిన అధ్యయనంలో ప్రపంచంలోని ప్రతి సంస్కృతికి సంబంధించిన భాషను మాట్లాడే మాటల్లో సంగీతపు ఛాయలు లేకుండా లేవు.


- **ప్రొ॥ ఈ.వి. సుబ్బారావు**, హైదరాబాద్

సుడోకు


ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డ, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

	4	3	7		5			
		5	2		1		4	
	6	2			4	8		
						4	8	
	8			7			3	
	5	9						
		6	9			5	7	
	7		4		2	1		
			6		7	9	2	


మొత్తం ఎన్ని?




ఇక్కడున్న బొమ్మలో మొత్తం ఎన్ని చతురస్రాలు ఉన్నాయో లెక్కకట్టగలరా?



బొమ్మలో ఉన్నవే



బొమ్మలో W ఆంగ్ల అక్షరంతో మొదలయ్యే అంశాలున్నాయి. అవేంటో పట్టుకుని గడుల్లో రాయగలరా?



జవాబులు: **బొమ్మలో ఉన్నవే:** Well. Wheel, Whale, Wolf, Web, Watermelon, Walrus, Wall **ఒకే ప్రశ్న:** ధన్వంతరి **చిలిపి ప్రశ్న:** టూవీలర్ అంటే సైకిల్ కాబట్టి! **మొత్తం ఎన్ని:** 16

సుడోకు:

1	4	3	7	8	5	6	9	2
8	9	5	2	6	1	3	4	7
7	6	2	3	9	4	8	5	1
6	3	7	1	2	9	4	8	5
4	8	1	5	7	6	2	3	9
2	5	9	8	4	3	7	1	6
3	2	6	9	1	8	5	7	4
9	7	8	4	5	2	1	6	3
5	1	4	6	3	7	9	2	8

22న జడ్పీ స్థాయీ సంఘ సమావేశం

జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: ఈ నెల 8న జరగాల్సిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు వాయిదా పడగా ఆ సమావేశాలను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థాయీ సంఘం -02 గ్రామీణ అభివృద్ధి, మధ్యాహ్నం 2 గంటలకు స్థాయీ సంఘం-3 వ్యవసాయం సమావేశాలు జరుగుతాయని చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సంబంధిత అధికారులు హాజరు కావాలని తెలిపారు.

యువకుల రక్తదానం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం రాక్‌స్టార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు షేక్ సల్మాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదనం చేశారు. ఫ్లెక్సీలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్ నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకొని ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న సల్మాన్ →

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: వ్యాపారాభివృద్ధికి శ్రీ మహావిష్ణువును ఎలా పూజించాలి?, ఇంట్లో దైవశక్తి పెరిగి శుభాలు జరగడానికి పాటించాల్సిన నియమాలు?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: బృందావనం (రాజేంద్రప్రసాద్, రమ్యకృష్ణ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': మసాలా వంటలు 'చికెన్ పన్నీర్ కర్రీ', 'ప్రాన్స్-65', కారం కారంగా 'పెప్పర్‌ఫిష్', చెఫ్స్ స్పెషల్ 'రాజస్థానిమటన్‌కర్రీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మహాతల్లి రిపీట్

01:15 ఫ్రూట్స్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 పోవే..పోరా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 నా షో నా ఇష్టం

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)

★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)

★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 10:30, 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)

★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ. 9:30, సా. 4:00)

★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ. 10:00)

★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)

★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (మ. 2:00, రా. 7:00)

★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (మ. 2:30, రా. 09:30).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొరకని దొంగ (కృష్ణ, రజని), 10-00: మార్నింగ్ షో: ఏది నిజం? (నాగభూషణం. జానకి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: వీడెవడండీ బాబు! (మోహన్‌బాబు శిల్పాశెట్టి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దెయ్యాలమేడ (కార్తీక్, అంబిక), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: శభాష్ సూరి(ఎన్టీఆర్, కృష్ణకుమారి), 10-00 సెకండ్ షో: దొంగ కోళ్ళు (రాజేంద్రప్రసాద్, సుమలత).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - మష్రూమ్ మసాలా గారెలు, జొన్న గోంగూర పులిహోర, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – మిల్లెట్ సాసేజ్ బ్రాత్, లీఫీ అండ్ వెజ్జి రెడ్ రైస్, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – హెల్తీ పౌడర్ విత్ బనానా, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – మ్యాంగో సలాడ్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసర కట్టు, బెండకాయ వేపుడు, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - గోవన్ సోరక్ కర్రీ - గోవన్ క్యూసైన్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – మాక్రోనీ చీజ్ బాల్స్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - ఫిష్ కలీయ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఫ్రైడ్ బట్టర్ చికెన్, మ.1.00: వావ్ ఏమి రుచి (స్క్యూవర్స్ స్పెషల్) – మస్టర్డ్ చికెన్ స్క్యూవర్స్, మమోడీప్ మస్టర్డ్ వెజిటబుల్స్, మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - తోటకూర గారెలు, మ.1.45: ట్రెండీ ట్రీట్స్, మ.2.30: చోటా చెఫ్ – స్ప్రింగ్ ఆనియన్ స్వీట్ కార్న్ పిజ్జా, సా.5.15: స్నాక్స్ – వంకాయ పకోడీ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం, చోడవరం, విశాఖ జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30తీర్థయాత్ర: శ్రీ సరస్వతి ఆలయం, అనంత సాగరం, మెదక్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 16-08-2017

SVBC — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (సహస్ర కలశాభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - వినాయకుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు-కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కళ్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 కృష్ణ.. ముకుంద.. మురారి, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 కృష్ణ వందే జగద్గురుమ్ - శ్రీమైలవరపు శ్రీనివాసరావు (రిపీట్) 02-30 రా..రా..కృష్ణయ్య (రిపీట్) 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 శ్రీకృష్ణలీలామృతం - డాక్యుమెంటరీ (రిపీట్) 05-00 గోపాలుడే.. గోవిందుడు (రిపీట్) + ప్రత్యేక వార్తలు + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 భక్తి చైతన్యం, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 శ్రీకృష్ణ క్షేత్రదర్శిని, 09-30 దేవీసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీవిష్ణు సహస్రం, 06-30 గోవింద నామాలు, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మి నమోస్తుతే, 08-00 మధురాభిషేకం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మి నమోస్తుతే, 05-30 గోవిందనామాలు, 06-00 శ్రీవిష్ణుసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 జన్మాష్టమి వైభవం, 09-00 భజరే నందబాలం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 గోపురం, 08-00 సినిమా: తులసి, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: లౌక్యం.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: దొంగాట, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 సినిమా: జ్యోతి లక్ష్మి, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: స్నేహమంటే ఇదేరా, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: ఒక్కడు, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: కృష్ణగాడి వీర ప్రేమ గాథ.

HBO — ఉదయం: 06-00 బిఫోర్ సన్‌సెట్, 07-30 టీవీ స్పెషల్ : ద గాడ్‌ఫాదర్, 07-45 టీవీ స్పెషల్ : బ్లాక్ మాస్, 07-59 ఐరన్ మ్యాన్, 10-06 ఏజెంట్ కోడి బ్యాంక్స్ 2 : డెస్టినేషన్ లండన్, 11-55 అర్గో, మధ్యాహ్నం: 01-59 ఎస్కేప్ టు విక్టరి, సాయంత్రం: 04-04 గెట్ స్మార్ట్, 06-00 ద అకౌంటెంట్, రాత్రి: 08-00 ద డార్క్ నైట్ రైజెస్, 11-07 డీప్ బ్లూ సీ.

బెట్టలో మొక్కజొన్న సంరక్షణ

వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున మొక్కజొన్న ఎండుతోంది. పలు రకాల వ్యాధులు సోకుతున్నాయి. మొక్కజొన్న సంరక్షణకు పాటించాల్సిన మెలకువలను మండల వ్యవసాయ అధికారి మాలతి సూచించారు.

వర్షాభావం వల్ల తేలిక నేలల్లో విత్తిన మొక్కజొన్న చేలలో ఆకులు ముడుచుకుంటున్నాయి. మొక్కలను కాపాడేందుకు.. లీటరు నీటికి 5 గ్రా. మల్టి-'కె' గానీ 20 గ్రాముల యూరియా గానీ కలిపి పిచికారి చేసుకోవాలి. దీంతో మొక్కజొన్న బెట్టను కొంతవరకు తట్టుకోగలుగుతుంది. ఈ విధానంతో కొన్ని రోజుల వరకు వర్షాభావ పరిస్థితులను అధిగమించే అవకాశం ఉంది.



ఎండిపోతున్న మొక్కజొన్న

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మొక్కజొన్నను కాండంతొలిచే పురుగు ఆశిస్తుంది. దీంతో పంట నష్టపోయే ప్రమాదం ఉంది. వీటి పిల్లపురుగులు ఆకుల పైనుండే పత్రహరితాన్ని తింటాయి. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండంలోపలికి చేరతాయి. ఈ ఆకులు విచ్చుకున్న తర్వాత పొడవాటి చిల్లులు లేదా చిన్న రంధ్రాలు ఆకులపై ఏర్పడతాయి. ఈ పురుగులు పెద్దవై పెరిగే అంకురాన్ని తినడం వల్ల మొగి ఎండిపోతుంది. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున మొక్కల సుడిలో వేయాలి లేదా మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారి చేయాలి. **– న్యూస్‌టుడే, శివ్వంపేట**

పశుపోషణలో పచ్చిమేతల ప్రాధాన్యం

రోజుకు ఒక పాడి పశువుకు 30-40 కిలోలు, సంవత్సరానికి 11-13 మెట్రిక్ టన్నుల పచ్చిమేత అవసరమవుతుంది. నీటి వసతిగల ఎకరా భూమిలో పండించిన పచ్చిమేత 5-6 పశువుల పోషణకు సరిపోతుంది. పశుగ్రాసాలను సాగు చేయడం వలన సంవత్సరం పొడవునా పచ్చిమేత లభ్యమవడమే కాక దాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

పాల ఉత్పత్తి సామర్థ్యం.. జన్యుపరంగా మేలైన జాతితో పాటు 60 శాతం వరకు మేపుపై ఆధారపడి ఉంటుంది. పోషక విలువలతో కూడిన పశుగ్రాసాన్ని పశువుకు అందిస్తే అధిక పాల దిగుబడులు వస్తాయనిపొందవచ్చునని చెప్పారు.

పచ్చిమేత ప్రాముఖ్యత: పశుగ్రాసాల్లో పశువుకు కావలసిన విటమిన్-ఎ, విటమిన్-ఇ, కాల్షియం, భాస్వరం లాంటి ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, మాంసకృత్తులు సమృద్ధిగా లభ్యమవుతాయి. పశువులకు మంచి పోషక విలువలు కలిగిన పశుగ్రాసాలను మేపటం వలన వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఆరోగ్యంగా ఉంటూ వ్యాధుల బారిన పడవు. పాల ఉత్పత్తి 20-25 శాతం వరకు పెరుగుతుంది. దీంతో రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి. పునరుత్పత్తి సామర్థ్యం సక్రమంగా ఉంటుంది. పశువులు సకాలంలో ఎదకు వచ్చి చూలు కడతాయి. ఈతల మధ్య వ్యవధి తగ్గుతుంది. సంవత్సరానికి ఒక లేగదూడ, 10 నెలలు పాలు పొందే అవకాశముంటుంది. ఈనిన పశువులు 90 రోజులలో ఎదకు వచ్చి చూడి కడతాయి. లేగదూడలు రోజుకు 500 గ్రాముల చొప్పున బరువు పెరుగుతాయి. పడ్డలు, పెయ్యలు త్వరగా పెరిగి ఎదకు వచ్చి చూలు కడతాయి. పశువులు ఆరోగ్యంగా, బలిష్టంగా ఉండి చక్కటి పని సామర్థ్యం కలిగి ఉంటాయి.

పచ్చిమేత రకాలు

ధాన్యపు జాతి: జొన్న, సజ్జ, మొక్కజొన్న, హైబ్రిడ్ నేపియర్, పారాగడ్డి, ఏపీబీయన్-1, ఏపీబీయన్-2, కో-3, కో-4.

కాయజాతి: పిల్లిపెసర, జనుము, అలసంద, లూసర్న్, బర్సీమ్, హెడ్జ్‌లూసర్న్, సిరాట్రో, స్టైలోలు ప్రధానమైనవి.

పశుగ్రాసంగా ఉపయోగపడే చెట్లు: సుబాబుల్, అవిశ, దిరిసెన, రావి, మర్రి, నల్లతుమ్మ మొదలైనవి. ఈ చెట్ల ఆకులు పశువులకు పుష్టికరమైన ఆహారం సమకూరుస్తాయి. పచ్చిమేత కొరతగా ఉన్నప్పుడు ఆకులను ఎండుమేతలో కలిపి పెడితే పాల దిగుబడి తగ్గదు.

నిల్వ చేసుకోవడం: పచ్చిమేతను ఎండపెట్టి కుప్ప వేసుకొని నిల్వ చేసుకోవచ్చు. పాతర వేసి మాగుడు గడ్డిగా నిల్వ చేసుకోవచ్చు.

పచ్చిమేతల సాగు: పశుగ్రాసాల్ని వర్షాకాలంలో అనువైన సమయంలో పెద్దఎత్తున సాగు చేసి 'హే'రూపంలో గాని, సైలేజి రూపంలో గాని నిల్వ చేసుకుని పశుగ్రాసం కొరత సమయంలో వాడుకునే వీలుంటుంది.

పచ్చిమేత వాడే విధానం: పచ్చిమేతను చాఫ్‌కట్టర్‌తో గాని కొడవలితో గాని 1 అంగుళం సైజు ముక్కలుగా కత్తిరించి మేపాలి. ముక్కలు చేసిన పశుగ్రాసాన్ని పశువులు ఇష్టంగా, పూర్తిగా తింటాయి. వృథా కాదు. పచ్చిమేతలో భాగంగా ధాన్యపుజాతి గ్రాసాల్ని కలిపి మేపితే పాల దిగుబడులు పెరుగుతాయి.

జాగ్రత్తలు: విత్తిన 15 రోజుల్లోపు జొన్నజాతి పశుగ్రాసాలను, వాడిపోయిన, పూర్తిగా ఎదగని లేత గడ్డిని పశువులకు మేపకూడదు. ఈ గ్రాసాన్ని తిన్న పశువులు నోటి, ముక్కు నుండి స్రావాలతో, అపస్మారక స్థితిలోకి పోయి చనిపోతాయి.



'భూమిలో ఉన్న సారం తెలుసుకుంటే ఎంత ఎరువు వేయాలి? ఏఏ పంట వేస్తే గిట్టుబాటు అవుతుందనేది తెలుస్తుంది. దీంతో రైతులు పరిమితికి మించి ఎరువులు వినియోగించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటల దిగుబడి తగ్గిపోయి ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రతి రైతుకు తను పండించే భూసారం గురించి తెలిస్తే ఇన్ని ఇబ్బందులుండవు.' **- గత సీజన్‌కు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర రైతాంగ సంక్షేమాన్ని ఉద్దేశించి అన్న మాటలు.**



'మట్టి పరీక్షలకు అనుగుణంగా పంటలేస్తేనే మేలు కలుగుతుంది. ప్రతి రైతు దగ్గర తనకు సంబంధించిన భూసార కార్డు దగ్గరుంటే దానికి అనుగుణంగా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు ఇచ్చే వీలుంటుంది. ఇది రైతాంగానికి అత్యావశ్యకం. ఇందుకు అవసరమైన చేయూత నిద్దాం.'

- గత బడ్జెట్ ప్రసంగంలో దేశ ప్రధాని మోదీ చేసిన కీలక వ్యాఖ్యలు

కిట్లు.. ముట్టుకుంటే ఒట్టు..

జిల్లాలో మట్టి పరీక్షల మాటే లేదు ● ఖరీఫ్ సీజన్‌లో సేవలకు దూరం



మండల వ్యవసాయ కార్యాలయాల్లో వృథాగా ఉంటున్న భూసార పరీక్ష పరికరాలు

– న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

పెట్టిన పెట్టుబడి మట్టిలో కలసిపోతే నష్టాలే వాస్తాయి. సాగు భూమిలో సారవంతం లోపించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. పెట్టుబడులు పెరగకుండా, దిగుబడులు పెంచుకునేందుకు భూసార పరీక్షలే రైతుల కడగండ్ల నుంచి గట్టెక్కిస్తాయని గట్టిగా నమ్మింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ప్రతి క్లస్టర్‌కు ఒక భూసార పరీక్ష మినీ కిట్‌ను అందజేశారు. ప్రతి వ్యవసాయ విస్తీర్ణాధికారికి ఒక కిట్‌ను పంపిణీ చేశారు. ఒక్కో దానికి సుమారు రూ.లక్ష వ్యయం వెచ్చించారు. ఈ లెక్కన జిల్లాకు 103 కిట్లు అందజేశారు. సుమారు రూ.1.03 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలవుతుంది. కానీ ఇప్పటికి ఇంకా రైతులకు వీటి ఫలితాలు అందలేదు. అక్కడక్కడ పరీక్షలు చేసిన ప్రయోజనాలు వివరించడం లేదు. చాలా చోట్ల వ్యవసాయ కార్యాలయాల్లో వీటిని ఓ మూలన పడేశారు. ఇంకొన్ని చోట్ల కిట్లను ఇప్పటివరకు తెరిచి చూడలేదు.



మట్టి పరీక్షలు

ఇవీ కారణాలు

▼ముందస్తు వర్షాలతో ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభమైంది.

▼భూసార పరీక్షల కిట్లు కాస్త ఆలస్యంగా పంపిణీ చేశారు.

▼మట్టి పరీక్షలకు వీలు లేకుండా అప్పటికే చాలా చోట్ల పంటలు సాగు మొదలైంది. ▼గ్రామాల్లో భూసార పరీక్ష కేంద్రాలకు తగిన వసతి లేదు. ప్రత్యేక గది అవసరం.

▼కేంద్రం వద్ద తగినంత నీరు, విద్యుత్తు సౌకర్యం ఉండడం లేదు.

▼ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్టు కేవలం 150 శాంపిళ్లకే సరిపోతాయి.

ఇవీ ప్రయోజనాలు

▼మట్టి పరీక్షల వల్ల భూమిలో సారం తెలుస్తుంది.

▼ఏ నేలలో ఏ పంట వేస్తే అనుకూలంగా ఉంటుందో నిర్ధారిస్తుంది.

▼సారవంతం చేసేందుకు ఏఏ ఎరువు ఎంతెంత వేయాలనేది సూచిస్తుంది.

▼అనవసరంగా పరిమితికి మించి రైతులు అవగాహన లేకుండా వేసే ఎరువులను నిలువరిస్తుంది. ఉదాహరణకు జిల్లాలోని నేలల్లో భాస్వరం నిల్వలు బాగా పెరిగిపోయాయి. దీని అవసరం ఇప్పుడు లేదు.

▼సీజన్ వారీగా నేలల్లో మార్పులు చోటుచేసుకుంటే ప్రత్యామ్నాయ పంటలకు గానీ, సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల పెంపకానికి ఈ పరీక్షల ఫలితాలు దోహదపడతాయి.

రబీలో కచ్చితంగా చేసి చూపిస్తాం

ఈసారి భూసార పరీక్షలు ఆలస్యమయ్యాయి. సీజన్ ప్రారంభం కావడంతో రైతులు మట్టి పరీక్షలకు ముందుకు రాలేదు. వ్యవసాయశాఖ సిబ్బంది కూడా రైతు సమగ్ర సర్వేలో, ఎరువులు, విత్తనాల పంపిణీలో తీరిక లేకుండా ఉండడంతో అనుకున్నంత పని వీలు కాలేదు. క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులున్న దృష్ట్యా వచ్చే రబీ నుంచి విజయవంతంగా మట్టి పరీక్షలు చేసి రైతులకు అందిస్తాం.

- వాజిద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి, నిజామాబాద్

కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ

ఆర్మూర్: ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో దళితులపై సాంఘిక బహిష్కరణ ఇంకా కొనసాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మంగళవారం ఆర్మూర్ రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహంలో మంథని గ్రామానికి చెందిన దళిత పెద్దలతో ఆయన సమావేశమై సాంఘిక బహిష్కరణకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, దళిత కుటుంబాల మధ్య అధికారులు ఒప్పందం చేసినప్పటికీ, ఇంకా వారిని గ్రామంలో శుభకార్యాలకు డప్పులు కొట్టనీయకుండా పక్కన పెట్టి ఇతర గ్రామాల నుంచి తెప్పించుకుంటున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీని రద్దుచేయాలని, గతంలో నమోదైన కేసు ప్రకారం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా పెద్ది వెంకట్రాములు, వెంకట్, తెడ్డు రవికిరణ్, పి.వెంకటేష్, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మురళీకృష్ణుని పల్లకి సేవ

మారుతినగర్(నిజామాబాద్ సాంస్కృతికం), న్యూస్‌టుడే: కృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆర్మూర్‌రోడ్ మారుతినగర్ మురళీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మచ్చ చంటయ్య తదితరుల నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి వారిని ఊరేగించారు. సామూహికంగా భక్తిగీతాలు, భజనలు ఆలపించారు.

పార్టీ కార్యాలయాల్లో పతాకావిష్కరణ



తెరాస జిల్లా పార్టీ కార్యాలయంలో..



భాజపా కార్యాలయంలో

నిజామాబాద్ సిటీ, న్యూస్‌టుడే: నిజామాబాద్‌లోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్ జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్సీ ఆకుల లలిత, టీపీసీసీ అధికార ప్రతినిధి మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత దేశభక్తి కలిగి ఉండాలన్నారు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని ప్రతి కార్యకర్త ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కేశ వేణు, రత్నాకర్, సుధాకర్‌రావు, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సుమీర్, శరత్, మోహన్, అరవింద్, చంద్రకళ, ఉషా, రాము, రామకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: తెరాస జిల్లా పార్టీ కార్యాలయంలో తెరాస జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ సుజాత, కార్పొరేటర్లు, తెరాస నాయకులు పాల్గొన్నారు.

ఇందూరు సిటీ: దేశంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని భాజపా జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరిపారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు యెండల లక్ష్మీనారాయణ, హన్మంత్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, బాల్‌రాజ్, గోపాల్, సుధాకర్, న్యాలం రాజు, సుగుణ, భరత్ భూషణ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్, స్వామి యాదవ్, శంకర్, నాగరాజు, శైలజ, గణేశ్, రషీద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఖలీల్‌వాడి: తెదేపా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు బాల్‌కిషన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంతో మంది వీరుల త్యాగఫలితంగా మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అలాంటి త్యాగమూర్తులను ఎప్పటికి మరవొద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజమల్లు, వినోద్‌కుమార్, సురేష్, రవి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



తెదేపా కార్యాలయంలో..



కాంగ్రెస్ భవన్‌లో ...